మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.manananationalistvoice.com
epaper.manananationalistvoice.com



రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు



ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 157 | 05 మంగళవారం, మే 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం


# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్



కొనుగోళ్లు లేక అన్నదాతల ఆగమాగం

శనగ పంట చేతికి వచ్చినా కొనుగోళ్లు ఏవీ

సదాశివపేటలో రైతులను పరామర్శించిన కెటిఆర్

02

# అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం

జలుక్‌బరి నుంచి 89,000

పైచిలుకు ఓట్లతో సిఎం గెలుపు

02

# ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

02

అసోం, పుదుచ్చేరిల్లో అధికారం నిలబెట్టుకున్న బిజెపి

బెంగాల్లో పాగా వేసిన బిజెపి..మట్టి కరిచిన మమతా బెనర్జీ

కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం

తమిళనాట విజయ్ కొత్త కెరటం

# బెంగాల్లో బిజెపి స్పష్టమైన ఆధిక్యం

సర్ ప్రక్రియతో

ఓట్లను దొంగిలించిన బిజెపి

సిఎం మమతా బెనర్జీ

తీవ్ర ఆరోపణలు



02

# కేరళంలో యూడిఎఫ్‌కు పూర్తి ఆధిక్యం

కేరళ కాంగ్రెస్

కార్యాలయంలో సంబరాలు

కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిన

కెసి వేణుగోపాల్

ప్రజలు మార్పు కోరుకున్నారన్న శశిథరూర్



**తిరువనంతపురం,మే4నేషనలిస్ట్ వాయిస్**

కేరళం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. ప్రస్తుతం యూడీఎఫ్ 97 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, అధికార ఎల్‌డీఎఫ్ 42 సీట్లలో లీడింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో యూడీఎఫ్ విజయం తథ్యంగా కనిపిస్తోంది. దీంతో కేరళం తదుపరి సీఎం ఎవరనే చర్చ మొదలైంది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత, కేరళంకు చెందిన తిరువనంతపురం ఎంపి శశిథరూర్ స్పందించారు. రాష్ట్రంలో ఓటర్లు మార్పు కోరుకుంటున్నట్లు ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని శశిథరూర్ తెలిపారు.

మిగతా 2లో

# జవహర్ డంపింగ్ యార్డును తొలగించండి

## సిఎంను కోరిన ప్రజాప్రతినిధులు

**హైదరాబాద్,మే4నేషనలిస్ట్ వాయిస్**

జవహర్ నగర్ డంప్ యార్డును తరలించాలాలని సీఎం రేవంత్‌ను పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేసారు. ఇక్కడి చెత్తను తొలగించి చుట్టుపక్కల ప్రజలకు విముక్తి కలిగించాల న్నారు. డంప్ యార్డును తొలగిస్తామన్న వాగ్దానాన్ని వారు గుర్తు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యాంటీ జవహర్ నగర్ డంప్ యార్డ్ జెఎసి కలిసింది. సీఎంను కలిసిన వారిలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జెఎసి కన్వీనర్ శంకర్ నారాయణ్, ఇతర జెఎసి నాయకులు అన్నారు. సమస్య తీవ్రత తెలుసని, పరిష్కారం ఆలోచిస్తున్నామని సిఎం అన్నారు.



# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేయాలి

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**నేషనలిస్ట్ వాయిస్ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 04**

సోమవారం,హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి,దుద్దిళ్ల శ్రీధర్ బాబు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి రాష్ట పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తున్నందున రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రాంతంలో



ఉంచుకోవాలన్నారు. గాలులకు టార్పాలిన్ కవర్లు ఎగిరి పోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మిగతా 2లో

# మోడీ నాయకత్వానికి ప్రజల మద్దతు

## ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు నాయుడు



**అమరావతి,మే4 నేషనలిస్ట్ వాయిస్**

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో కొనసాగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రదర్శన స్పష్టంగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు.

మిగతా 2లో



# ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

- భారత రాజ్యాంగాన్ని బలపరచిన ఎన్నికలు
- భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన ఎన్నికలు
- బెంగాల్ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి
- గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం
- అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఈ ఎన్నికల విశేషం
- తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అండగా ఉంటా
- బిజెపి కార్యాలయంలో జరిగిన విజయోత్సవంలో మోడీ

**న్యూఢిల్లీ,మే4నేషనలిస్ట్ వాయిస్**

ఇవాళ భాజపా చరిత్ర సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఐదు రాష్ట్రాల ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని అన్నారు. ఇది ప్రజలకు నిజమైన భరోసా ఇచ్చిన రోజు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు. అని ప్రధాని అన్నారు. నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధాని మోదీ దిల్లీలోని భాజపా కార్యాలయానికి సంప్రదాయ పంచెకట్టుతో వచ్చారు.

మిగతా 2లో




# తమిళనాట మరోమారు సినీ ప్రభంజనం

02

- మామూలు నటుడి విశ్వరూప ప్రదర్శనం
- ఎంజిఆర్, జయలలిత తరవాత అంతటి విజయం
- సామాన్యుడిగా వచ్చి అసామాన్యుడి ఎదిగిన విజయ్

# తమిళనాట మరోమారు సినీ ప్రభంజనం

మొదటిపేజీ తరువాయి

**చెన్నై,మే4నేషనలిస్ట్ వాయిస్**

తమిళనాట మామూలు నటుడిగా కనిపించిన వ్యక్తి.. నేడు కోట్ల మంది గొంతుకగా మారి రాజకీయ రంగంలో పెను సంచలనం సృష్టించాడు. అభిమానుల గుండెల్లో 'దళపతి'గా ముద్ర వేసుకున్న జోసెఫ్ విజయ్.. ఇప్పుడు 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) జన నాయకుడిగా తన కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టేందుకు సిద్ధమయ్యారు. రీల్ లైఫ్ హీరో నుంచి రియల్ లైఫ్‌లో రాజకీయ నాయకుడిగా ఎంట్రీలోనే ప్రభంజనం సృష్టించారు విజయ్. గతంలో ఎంజిఆర్, జయలిత తరవాత ఇప్పుడు విజయ్ ఆ దిశగా ప్రయాణం మొదలయ్యిందనే చెప్పాలి. రాజకీయాల్లోకి రావాలని రజనీకాంత్ అనుకుని వెనకడుగు వేశారు. కమలహాసన్‌కు కలిసి రాలేదు. 1974 జూన్ 24న విజయ్ జన్మించారు. తల్లి శోభ గాయని, తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకుడు. తొలినాళ్లలో కనీసం బాత్రూమ్ కూడా లేని చిన్న గదిలో విజయ్ తల్లిదండ్రులు నివాసం ఉండేవారు. అతడికి ఏడేళ్లు వచ్చేవరకు ఆర్థికంగా సతమతమవుతూనే ఉండేది ఆ కుటుంబం. ఆ తర్వాతే విజయ్ తల్లిదండ్రులు విజయ్‌కాంత్‌తో 'చట్టం ఒరు ఇరుట్టరై' తీశారు. ఈ సినిమా సూపర్ హిట్ అయింది. దీంతో వీరు ఆర్థికంగా స్థిరపడ్డారు. విజయ్ చిన్నప్పుడు చాలా అల్లరి చేసేవాడు. ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ ఆట పట్టించేవాడు. కానీ, ఆయన సోదరి మరణం విజయ్ జీవితాన్ని మార్చేసింది. తన చెల్లి విద్య అంటే విజయ్‌కు ప్రాణం. ఆమె చనిపోయిన తర్వాత విజయ్ ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయారు. నేటికీ ఆయన తెరపై అంత ఎనర్జీతో కనిపిస్తున్నా.. బయట మాత్రం చాలా మితభాషిగా ఉండటానికి ఆనాటి విషాదమే కారణమని విజయ్ తండ్రి చంద్రశేఖర్ చెబుతుంటారు. చిన్నప్పటి నుంచి తండ్రిని చూసిన విజయ్ దృష్టి సినిమాల వైపు మళ్లింది. కానీ, 'మీవాడు హీరో ఏంటండీ, అసలు నటుడిగానే పనికిరాడు... బండమొహం వాడిది!' అంటూ ఎవరూ అవకాశాలు ఇవ్వలేదు. దీంతో రూ.60లక్షలు అప్పు చేసి విజయ్ తండ్రే దర్శకుడిగా ఆయనతో సినిమా తీశారు. అలా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్‌కు తొలి ప్రయత్నంలో నిరాశే ఎదురైంది. తొలి సినిమా 'నాళయ తీర్పు' ఫ్లాప్. రెండు నెలలు కనీసం ఫ్రెండ్స్‌ను కలవడానికి కూడా విజయ్ బయటకు వెళ్లలేదు. చివరకు ఆ స్నేహితులే విజయ్‌కు అండగా నిలబడ్డారు. ఆయనలో ధైర్యం నింపారు. తనను తాను నిరూపించుకోవాలనుకున్న విజయ్.. డ్యాన్స్ పైన కసరత్తు మొదలుపెట్టాడు. కరాటే నేర్చుకున్నాడు. పగలూ, రాత్రీ ఇంకే ధ్యాసా లేకుండా సాధన చేశాడు. ఆ తర్వాత సరికొత్త విజయ్‌గా 'రసిగన్' అనే సినిమా చేశాడు. 1994లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఒకప్పుడు విమర్శించినవాళ్లే.. శెభాష్ అంటూ మెచ్చుకున్నారు. 1990 చివర్లో, 2000 ప్రారంభంలో విజయ్ సినీరంగాన్ని శాసించారు. 'ఖుషి', 'గిల్లి' వంటి సినిమాలతో సూపర్ హిట్‌లు అందుకున్నారు. అప్పుడే అందరూ విజయ్‌ను 'ఇళయ దళపతి' అని పిలవడం ప్రారంభించారు. అనతికాలంలోనే ఆ పేరు దళపతిగా మారింది. విజయ్ నటించిన 'అదిరింది', 'సర్కార్', 'విజిల్', 'మాస్టర్' వంటి సినిమాలు ఆయన్ని ప్రేక్షకులకు మరింతగా చేరువ చేశాయి. ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకున్న విజయ్.. వారికి సేవ చేయాలని రాజకీయ రంగంలోకి ప్రవేశించారు. 2024 ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కజగం' స్థాపించారు. ఈ పార్టీ ప్రారంభించాక 'లియో' ఆడియో రిలీజ్‌లో విజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయనకు అభిమానులంటే ఎంత ప్రేమో తెలియజేశాయి. 'నాపై ఇంత అభిమానం చూపుతున్న మీకు ఏదైనా తప్పకుండా చేయాలనుంది. చేస్తా. మీ కాలికి చెప్పులా ఉండటానికి కూడా వెనకాడను. ఇప్పుడేం జరిగినా పట్టించుకోకుండా అందరూ ఓపికగా ఉండండి. విజయాన్ని అందుకోవచ్చు' అన్నారు. నాడు చెప్పినట్లు గానే నేడు విజయాన్ని అందుకున్నారు.

# ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి

పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విజయోత్సవ సంబరాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. బెంగాలీ ధోతితో విచ్చేసిన ప్రధానికి పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. 'మోదీ మోదీ' నినాదాలతో కార్తకర్తలు హోరెత్తించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బెంగాల్ బీజేపీ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఉపశమనం కలిగిందన్నారు. పార్టీ కార్యకర్తల సంబరాల్లో నేనూ పాల్గొంటున్నా. బెంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారు. తమిళనాడు, కేరళలోనూ పోలింగ్ శాతం బాగా పెరిగింది. దేశంలో 20కిపైగా రాష్ట్రాల్లో భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయి. గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకూ నెగ్గాం. గంగానది ఆశీర్వాదం వల్లే ఈ విజయాలు దక్కాయి. బ్రహ్మపుత్ర ఆశీర్వాదం వల్ల అస్సాంలోనూ హ్యాట్రిక్ సాధించాం. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలను మేం నెరవేర్చాం. బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుంది. ఇక నుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని ప్రకటించారు. సుపరిపాలన అందించినందుకే ప్రజలు మాకు పట్టం కట్టారు. తమ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే భాజపా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా అంటేనే అభివృద్ధి.. సంక్షేమం అని మోదీ పేర్కొన్నారు.బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అసాధారణమైన, చారిత్రక తీర్పునిచ్చారని, ఆ ఆనందం కార్యకర్తల కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్‌లో నూతన చరిత్రను ఆవిష్కరించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టాక ఆయన మార్గదర్శకంలో జరిగిన తొలి ఎన్నికలు ఇవంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకూ ప్రతిచోట కమలం వికసించిందని, కామాక్ష అమ్మవారి ఆశీర్వచనం పుష్కలంగా లభించిందని చెప్పారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన కలలుగన్నారని, అది ఇన్నేళ్ల తర్వాత వాస్తవరూపం దాల్చిందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇచ్చారని చెప్పారు. బెంగాల్‌లో మార్పుకోరుతూ పవనాలు బలంగా వీచాయని పేర్కొన్నారు. బీజేపీ అంటేనే సుపరిపాలన అనే విషయం ప్రజలకు బాగా తెలుసునని ప్రశంసించారు. స్సాంలో బీజేపీ-ఎన్డీయేను ప్రజలు మరోసారి ఆశీర్వదించారని, అభివృద్ధికి ప్రజలు బాసటగా నిలిచారని ప్రధాని కొనియాడారు. తిరుగులేని తీర్పునిచ్చిన అస్సాం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వోతో ముఖాభివృద్ధికి భరోసాగా ఉంటామన్నారు. దశాబ్దాలుగా పార్టీ, కూటమి ఎదుగుదలకు అవిశ్రాంతంగా కృషి చేసిన బీజేపీ-ఎన్డీయే కార్యకర్తలను అభినందించారు. ముఖ్యమంత్రి ఎన్.రామస్వామి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం టాక్ రికార్డు, సుపరిపాలనకు మరోసారి పట్టం కట్టిన పుదుచ్చేరి ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తలకు అభినందనలు చెప్పారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్‌కు ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. బీజేపీ-ఎన్డీయేకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కేరళ ప్రగతి కోసం, వికసిత కేరళం విజన్ సాకారం కోసం తాము పనిచేస్తామని చెప్పారు. కేరళం ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. తమిళనాడులో మంచి ఫలితాలు సాధించిన విజయ్ టీవీకేను ప్రధాని అభినందించారు. ఎన్డీయేకు మద్దతుగా ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యలు, వారి జీవనప్రమాణాల మెరుగుదలకు తాము ఎప్పుడూ ముందుంటామని చెప్పారు. తమిళనాడు ప్రగతి, ప్రజాక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జెపి నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

మొదటిపేజీ తరువాయి

## అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం
## జలుక్‌బరి నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో సిఎం గెలుపు

**గువాహటి,మే4నేషనలిస్ట్ వాయిస్**

అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. 126 స్థానాలు ఉన్న అసోంలో బిజెపి వందకు పైగా సీట్లను గెల్చుకుని తిరుగులేదని నిరూపించింది. ఇక్కడ కాంగ్రెస్ నేత గోగోయ్ అపజయం పాలయ్యారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. హిమంత సైతం తన సొంత నియోజకవర్గమైన జలుక్‌బరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన బిదిష నియోగ్‌కు 31,951 ఓట్లు పోలయ్యాయి. హిమంత బిశ్వ శర్మ 2015లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. 2021 నుంచి అస్సాంలో బీజేపీకి కీలకనేతగా నిలిచారు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను వ్యతిరేకించడం, ఆదివాసీ భూములను చొరబాటుదారుల నుంచి విముక్తి కలిగించడంతో ముఖ్యమంత్రిగా అన్ని ప్రధాన వర్గాలుగా చేరువయ్యారు. ముఖ్యంగా చికెన్‌నెక్ కారిడార్‌పై బంగ్లా ప్రకటనలు తిప్పికొట్టడం, బెలూచిస్థాన్ స్వాతంత్ర పోరాటానికి మద్దతుగా నిలవడం, అసాంలో వరద నివారణ చర్యలు తీసుకోవడం వంటి చర్యల ద్వారా ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బంగ్లా చొరబాట్లకు పూర్తి అడ్డుకట్ట వేస్తామని, ఎన్ఆర్‌సీని కచ్చితంగా అమలవుతుందని ఆయన చేసిన ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంది. ప్రధానమంత్రి మోదీ సైతం హిమంత్ బిశ్వ శర్మ ప్రచారానికి దన్నుగా నిలవడంతో అస్సాంలో బీజేపీ తిరుగులేని విజయాన్ని మరోసారి సొంతం చేసుకుంది.

మొదటిపేజీ తరువాయి

## మోడీ నాయకత్వానికి ప్రజల మద్దతు

ప్రజల్లో మోదీపై విశ్వాసం తగ్గలేదని, మరింతగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి దిశగా కేందప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత భారత్' లక్ష్యానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ దిశగా కేందప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా అమలవుతోందని సీఎం కొనియాడారు. అభివృద్ధి ఫలాలు ప్రతివర్గానికీ అందేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత ఐక్యంగా, బలంగా మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, 'వికసిత భారత్' దార్శనికతకు ఇది బలమైన మద్దతని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'సబ్ కా సాథ్' స్ఫూర్తితో దూసుకెళ్తున్న ఎన్డీఏ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మరింత బలోపేతం అవుతుందని ఉద్ఘాటించారు.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

**సంగారెడ్డి,మే4నేషనలిస్ట్ వాయిస్**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుని చచ్చే వరకు వేధిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శనగ పంట వచ్చి.. నెల రోజులైనా ఇప్పటి వరకు ఆ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇప్పటి వరకు సరిగా ఇవ్వలేదన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను ఈ ప్రభుత్వంలోని నేతలు పచ్చి మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ పంట కూడా సరిగ్గా కొనుగోలు చేయడం లేదంటూ ప్రభుత్వ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా.. కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ప్రారంభించ లేదన్నారు. ధాన్యం దళారుల పాలు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ కుండ బద్దలు కొట్టారు. సీఎం కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు వేశారని కేటీఆర్ గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేయవద్దని ఈ ప్రభుత్వం ఆలోచన అని చెప్పారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. అందుకే ఈ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని వివరించారు. సీఎం, మంత్రులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడైనా సందర్శించారా..? అని ఈ సందర్భంగా రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎంకి భూముల కొనుగోళ్లు, రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ, పిడుగులు, గుండెపోటు తదితర కారణాలతో రైతులు చనిపోతుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ రాసిన లేఖతో రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు.

మొదటిపేజీ తరువాయి

## బెంగాల్లో బిజెపి స్పష్టమైన ఆధిక్యం

**కోల్‌కతా,మే4నేషనలిస్ట్ వాయిస్**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో భాజపా 190 స్థానాల్లో ముందంజలో ఉండడంతో అక్కడ బిజెఇప ప్రభుత్వ ఏర్పాటు దాదాపుగా ఖాయమయ్యింది. ఈ క్రమంలో సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో భాజపా ఓట్లను దొంగిలించిందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. 'ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరూ కౌంటింగ్ కేంద్రాలను విడిచి వెళ్లొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఇది భాజపా పథకం. మొదటి రెండు, మూడు రౌండ్లలో వారే ఆధిక్యంలో ఉన్నట్లుగా చూపిస్తారని నేను ముందు నుంచి చెబుతూనే ఉన్నాను. కొన్నిచోట్ల రెండు, మూడు రౌండ్ల తర్వాత కౌంటింగ్ ఆపేశారు. టీఎంసీని అణచివేసేందుకు కేంద్ర బలగాలను బలవంతంగా ఉపయోగిస్తున్నారు. సీట్ల ఆధిక్యంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం కేంద్ర బలగాలతో కలిసి ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. రాష్ట్ర పోలీసులు కూడా కేంద్ర బలగాలకు పూర్తిగా లొంగిపోయారు' అని మమత ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏజెంట్లు, కార్యకర్తలు ఆందోళన చెందొద్దని, ధైర్యంగా ఉండాలని కోరారు. ఇంకా చాలా రౌండ్లు ఉన్నాయని.. తుది ఫలితాల్లో తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా.. 293 సీట్లకు ఓట్ల లెక్కింపు జరుగుతుండగా.. 190 స్థానాల్లో భాజపా ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 97 స్థానాల్లో, కాంగ్రెస్ 1 చోట ఆధిక్యంలో ఉన్నాయి. ఈ క్రమంలో ఎన్నికల కౌంటింగ్‌కు ముందు బీజేపీపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు చోటు చేసుకున్నాయన్నారు. సీసీ టీవీలు కూడా ఆఫ్ అయ్యాయని పేర్కొన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు ఉంచిన ప్రదేశాలకు వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఇవన్నీ బీజేపీ అదేశాల మేరకే జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితులు నెలకున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ పార్టీ కార్యకర్తలకు సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని వారికి సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్ కోసం అధికారులను డిమాండ్ చేయాలని కేడర్‌ను పశ్చిమ బెంగాల్ సీఎం కోరారు.

మొదటిపేజీ తరువాయి

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేయాలి

అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు తెలియజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, షామియానా,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.తేమ యంత్రాలు,ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు.ఎక్కడ కూడా జాప్యం చేయకూడదన్నారు. హమాలీలు, వాహనాల కొరత రాకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు.ప్రతి కొనుగోలు కేంద్రాలకు గ్రామ, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలన్నారు. మే నెల చివరి కల్లా 80% ధాన్యం కొనుగోళ్ళు పూర్తి చేయాలన్నారు.ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్ లు సరిపడా ఉండేలా చూసుకోవాలని, అలాగే ఏ రోజుకు ఆరోజు ధాన్యం కొనుగోలు వివరాలను తెలియజేయాలని, ఓపీఎంఎస్ లో వెంటనే ధాన్యం కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలన్నారు. కొనుగోలు అయిన ధాన్యం త్వరగా దిగుమతి అయ్యేలా పర్యవేక్షించాలన్నారు.అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు గ్రామ, మండల,జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉంటూ యాసంగి ధాన్యం సాఫీగా కొనుగోలు అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ,జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి,ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణ,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

**న్యూఢిల్లీ,మే4నేషనలిస్ట్ వాయిస్**

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా వచ్చాయి. అసోం, పుదుచ్చేరిలో అధికారం నిలుపుకున్న బిజెపి, బెంగాల్లోనూ విజయభేరి మోగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం సాదించింది. తమిళనాట విజయ్ నేతృత్వంలోని టివికె అనూహ్యంగా దూసుకుని వచ్చింది. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ హవా కొనసాగింది. డీఎంకే, అన్నాడీఎంకేను దాటి ఆధిక్యంలో కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి షాకిస్తూ భాజపా దూసుకెళ్లింది. కేరళలో యూడీఎఫ్ కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది. తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే 104 చోట్ల ఆధిక్యంలో ఉంది. డీఎంకే 62, అన్నాడీఎంకే 68 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 293 స్థానాలకు గానూ.. భాజపా దాదాపు 205 చోట్ల ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 85 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. కేరళలో 140 స్థానాలుండగా.. యూడీఎఫ్ 100 సీట్లను గెల్చుకుంది.. ఎల్‌డీఎఫ్ 32 స్థానాల్లో, ఎన్డీయే 3చోట్ల గెలుపొందింది. అస్సాంలో 126 స్థానాలుండగా.. భాజపా 100కు పైగా సీట్లతో హ్యాట్రిక విజయాన్ని నమోదు చేసింది. స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 26 చోట్ల ముందంజలో ఉంది. పుదుచ్చేరీలో 30 స్థానాలకు గానూ ఎన్నార్ కాంగ్రెస్9 చోట్ల గెలిచి 11 చోట్ల ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2 చోట్ల గెలిచి.. 5 స్థానాల్లో ముందంజలో ఉంది. మొత్తంగా బిజెపి తనకున్న రెండు రాష్ట్రాలకు తోడు బెంగాల్లో పాగా వేసింది. కేరళలో పదేళ్ల తరవాత మళ్లీ కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాట ద్రవిడ పార్టీలకు పరాభవం తప్పలేదు.

మొదటిపేజీ తరువాయి

# కేరళంలో యూడిఎఫ్‌కు పూర్తి ఆధిక్యం

పాలన పట్ల మరింత నిర్మాణాత్మకమైన, దూరదృష్టితో కూడిన విధానం వైపు ఓటర్లు మారుతున్నట్లు ఈ తీర్పు సూచిస్తుందన్నారు. పాలక కూటమికి చెందిన కొందరు మంత్రులకు, ఎమ్మెల్యేలకు ప్రజలు వ్యతిరేకంగా ఓటు వేశారు. వారికి ఓటు వేయడం అంటే, దుష్పరిపాలన కొనసాగడమేనని ప్రజలు గ్రహించారు. ఇది ఓటర్ల విచక్షణకు అద్భుతమైన సంకేతం. ఫలితం ఊహించిన దానికంటే మెరుగ్గా ఉంది. ఇక్కడ సునాయాసంగా మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలం. తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే విషయం నాకు తెలియదు. హైకమాండ్ తుది నిర్ణయం తీసుకుంటుంది' అని థరూర్ సమాధానమిచ్చారు కేరళంలో యూడీఎఫ్ గెలిస్తే ముఖ్యమంత్రి అయ్యేందుకు పార్టీలో చాలా మంది అర్హులు ఉన్నారని , అయితే ఆ పదవికి ముగ్గురి పేర్లను పరిశీలిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీజే కురియన్ శనివారం తెలిపారు. అయితే ఆయన ఆ ముగ్గురి పేర్లను వెల్లడించలేదు. ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో హైకమాండ్ తీసుకునే తుది నిర్ణయాన్ని పార్టీలోని ప్రతిఒక్కరూ ఆమోదిస్తారని ఆయన చెప్పారు. అయితే అందరి దృష్టి కెసిఆ వేణుగోపాల్‌పై ఉందని ప్రచారం. కేరళం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూనైటెడ్ డెమెక్రటిక్ ఫ్రెంట్ (యూడీఎఫ్) కూటమి తన సత్తా చాటింది. మొత్తం140 అసెంబ్లీ స్థానాలకు గాను 100కు పైగా నియోజకవర్గాల్లో యూడీఎఫ్ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు.

# తమిళనాట విజయ్ పార్టీ విజయం ఖాయం

- ఏడాది క్రితమే జోస్యం చెప్పిన ప్రశాంత్ కిషోర్
- ఆనాటి వీడియో సోషల్ మీడియాలో వైరల్

**న్యూఢిల్లీ,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

తమిళనాడులో విజయ్ టీవీకే 98 నుంచి 120 సీట్లు గెలుస్తుందని గత ఏడాది మార్చిలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ముందే జోస్యం చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ తాజాగా సునామీ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు ఖాయమని ఏడాది క్రితమే ప్రశాంత్ కిషోర్ చెప్పిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'ఈ వీడియో దాచి పెట్టుకోండి. ఫలితాల తరువాత ప్లే చేయండి' అని ఆ వీడియోలో ప్రశాంత్ కిషోర్ సవాలు విసిరారు.ప్రశాంత్ కిషోర్ గత ఏడాది మార్చిలో తంతి టీవీ కి ఇంటర్వ్యూ ఇచ్చారు. టీవీకే ఆవిర్భావం జరిగి అప్పటికి ఏడాది అయింది. తమిళ సూపర్‌స్టార్, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ విజయావకాశాలపై అడిగిన ప్రశ్నకు ప్రశాంత్ కిషోర్ సూటిగా సమాధానమిచ్చారు. విజయ్ ఒంటరిగా ఎన్నికల బరిలోకి వెళ్లాలని పట్టుదలగా ఉన్నారని, అందులో మార్పు ఉంటుందని తాను అనుకోనని చెప్పారు. ఒంటిరిగా ఎన్నికల్లోకి వెళ్తే తమిళనాడులో ఆయన విజయం సాధిస్తారని అన్నారు. విజయానికి అవసరమైన 118 సీట్ల కంటే ఎక్కువే సాధిస్తారని పేర్కొన్నారు. 'ఈ వీడియోను దాచిపెట్టుకోండి... ఫలితాల తరువాత ప్లే చేయండి' అని కూడా ఆయన ఢంకా బజాయించారు. ప్రశాంత్ కిషోర్ 'ఐ-ప్యాక్' పొలిటికల్ స్ట్రాటజీ సంస్థ తమిళనాడులో టీవీకేతో కలిసి పనిచేసిందనే వార్తలు కూడా వచ్చాయి. విజయ్‌తో ఉన్న అసోసియేషన్‌ను ఆ ఇంటర్వ్యూలో ప్రశ్నించినప్పుడు, తాము రాజకీయ సహచరుల కంటే మంచి మిత్రులమని అన్నారు. ఐదేళ్ల క్రితం తొలిసారి తాము మాట్లాడుకున్నామని, ఆయనకు తాను రాజకీయ సలహాదారు కాదని, సిద్ధాంతాలు, విలువలపై అభిప్రాయాలు పంచుకుంటూ ఉంటామని చెప్పారు.

## తమిళనాడు సీఎంగా దళపతి విజయ్: ఏలూరు జిల్లాలో మిన్నంటిన సంబరాలు !

**టి. నర్సాపురం: మే 4 (నేషనలిస్ట్ వాయిస్)**

రాజకీయాల్లో సరికొత్త శకాన్ని లిఖిస్తూ 'తమిళగ వెట్రి కళగం' అధినేత, దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై తెలుగు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండల కేంద్రంలో విజయ్ అభిమాన సంఘం నాయకులు పింగుల మధు ఆధ్వర్యంలో వేడుకలు అంబరాన్నంటాయి.

**'విజిల్' తో పాలభిషేకం**

మండలంలోని జగజ్జీవన్ రామ్ విగ్రహం వద్ద పింగుల మధు, సుబ్బు తారక్ నేతృత్వంలో అభిమానులు తరలివచ్చారు. విజయ్ చిత్రపటానికి 'విజిల్' వేస్తూ, ఆ శబ్దాల మధ్య అత్యంత ఉత్సాహంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పింగుల మధు మాట్లాడుతూ.. దళపతి విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం తమకు గర్వకారణమని, ఆయన పాలనలో తమిళనాడు అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆకాంక్షించారు.

**శుభాకాంక్షల వెల్లువ :**

"తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన దళపతి విజయ్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు" అంటూ బ్యానర్లు ప్రదర్శించి నినాదాలు చేశారు.

**కేక్ కటింగ్ :**

పింగుల మధు సమక్షంలో అభిమానులు కేక్ కట్ చేసి, "సీఎం విజయ్" అంటూ కేరింతలు కొట్టారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

**పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో చిలక యేసు బాబు, నార్లపాటి దుర్గారావు, రాయల పీరయ్య, నందిపాము వెంకటేశ్వరరావు, చమటపాము బాబురావు, కోలుకులూరి రాంబాబు, జీజ్జువరపు జయరాజు, పచ్చిగోళ్ళ జాన్, అద్దేపల్లి దుర్గాప్రసాద్, నర్లపాటి వంశీ, జీజ్జువరపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.
ఈ వేడుకతో టి. నర్సాపురం వీధులన్నీ విజయ్ నామస్మరణతో మారుమోగిపోయాయి. యువత పాల్గొని తమ అభిమాన నాయకుడి విజయాన్ని ఘనంగా చాటుకున్నారు.



## నటులు తలచుకుంటే చరిత్ర సృష్టిస్తారు

- విజయ్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ అభినందనలు

**అమరావతి,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు ఎన్నికల ఫలితాలపై హిందూపురం ఎమ్మెల్యే, నందమూరి బాలకృష్ణ స్పందించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో విజయం సాధించిన బీజేపీ, ఎన్డీఏ కూటమి పార్టీలకు బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సారథ్యంలోనే నూతన భారత నిర్మాణం సాధ్యం అవుతుందని అన్నారు. ఈ ఘన విజయాన్ని సాధించిన ఎన్డీఏ కూటమికి విజయాభినందనలు తెలియజేశారు.మరోవైపు తమిళనాడు ఎన్నికల ఫలితాలపై బాలయ్య స్పందిస్తూ తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావును స్మరించుకున్నారు. నటుడు తలచుకుంటే చరిత్రను తిరగరాయగలడని తమిళనాట ఎంజీఆర్, తెలుగునాట ఎన్టీఆర్ నిరూపించారని గుర్తు చేశారు. మళ్లీ ఆ ప్రభంజనాన్ని స్ఫురణకు తెచ్చిన సోదరుడు విజయ్‌ను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళ ప్రజలు తనపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చటమే లక్ష్యంగా ముందుకు సాగాలని బాలకృష్ణ అభిలషించారు.

# నేటి నుంచి మెగా రైతు మేళా

- హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మెగా రైతు మేళాలో పాల్గొననున్న రైతులు
- మెగా రైతు మేళాను ప్రారంభించనున్న రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పాల్గొననున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు
- ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషా





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హనుమకొండ లోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు జరిగే మెగా రైతు మేళాకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు ఉత్సవాలలో భాగంగా ఈనెల 5, 6, 7 తేదీల్లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి మెగా రైతు మేళాను హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ పథకాలు, పంటల సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రొఫెసర్లు శాస్త్రవేత్తలు ఈ ఉత్సవంలో పాల్గొని రైతులకు వివరించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి నిర్వహిస్తున్న ఈ మెగా రైతు మేళాను రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. రాష్ట్ర మంత్రితో పాటు ఇతర మంత్రులు, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతి నిధులు పాల్గొననున్నారు. రైతులు కూర్చునే విధంగా టెంట్లు, కుర్చీలు, ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను, పరికరాలను గురించి తెలియజేసే విధంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్లు, అధికారులు రైతులకు అవగాహన కల్పించేందుకు సమరం150 స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. డిజిటల్ నిదానం ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నారు. మెగా రైతు మేళాను ప్రతిష్టాత్మకం గా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

**ఏర్పాట్లను పరిశీలించిన ఐఏఎస్ అధికారులు**


ఆర్ట్స్ కళాశాల వేదికగా మూడు రోజులపాటు నిర్వహిస్తున్న మెగా రైతు మేళా ఏర్పాట్లను రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, హాకా మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. సభా వేదిక, టెంట్లు, కుర్చీలు, స్టాల్స్, భోజన సదుపాయాలు, వీఐపీ వాహనాలు, రైతులు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలు, తదితర ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో వారు పరిశీలించారు. భద్రత వంటి అంశాలను పోలీస్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా షేక్ యాస్మిన్ భాషా, చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి, ట్రాఫిక్ అదనపు డిసిపి ప్రభాకర్ రావు ఏర్పాట్లపై అక్కడే ఉండి అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. మెగా రైతు మేళా ఏర్పాట్లు, నిర్వహణ లో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు.

# పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## - పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి







**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సివిల్ సప్లైస్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు వాకాటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొనగా, హన్మకొండ కలెక్టరేట్ నుండి
జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్పాయి, అదనపు కలెక్టర్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పిపిసి కేంద్రాలకు మొత్తం 21.34 లక్షల మెట్రిక్ టన్నుల వరి చేరగా ఇప్పటి వరకు 13.32 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వరిని తక్షణమే కొనుగోలు చేయాలని, హమాలి, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల తడిసిన వరిని వెంటనే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు.
రైతులకు వాతావరణ హెచ్చరికలను నిరంతరం అందించాలని, జిల్లా స్థాయిలో తగినంత టార్పెలిన్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని పిపిసి కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. మెరుపు, వానల సమయం లో రైతులు కరెంట్ స్తంభాలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో ఐకెపి, పిఎసిఎస్ ల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లుకు తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలించే క్రమంలో లారీల సమస్య తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. సీఎంఆర్ పెండింగ్ లో ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. అకాల వర్షాలు ఉన్న నేపథ్యంలో వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా తెలియ జేయాలన్నారు. జిల్లాలో పది వేల క్వింటాలకు పైగా ధాన్యం సేకరించే కొనుగోలు కేంద్రాల పరిస్థితులను ఎప్పటికప్పుడు సంబంధిత మండలాల తహసిల్దార్లు, మిగతా ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎం లు, నోడల్ అధికారులు పర్య వేక్షించాలని తెలియజేశారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్లోడింగ్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మక్కలు కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం కావాలన్నారు. మక్కల కొనుగోలు, తరలింపు, గోదాములలో నిల్వ చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆ ప్రక్రియ అంతా సాఫీగా సాగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజీద్ అలీ, డిఎం సివిల్ సప్లై మహేందర్, డీసీవో సంజీవరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలను బాలికలకు సురక్షిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి

## - హసన్ పర్తి ఎంపీడీవో సుమన వాణి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

గ్రామాలను బాలికలకు సురక్షిత ప్రాంతాలుగా తీర్చి దిద్దేందుకు మనందరం కృషి చేయాలని హసన్ పర్తి ఎంపీడీవో సుమన వాణి అన్నారు. సోమవారం హసన్ పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ లోని సెమినార్ హాల్ లో సెర్ప్ -డిఆర్ డిఏ ఆధ్వర్యం లో కిశోర బాలికల కోసం స్నేహ సమ్మర్ క్యాంప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుమన వాణి మాట్లాడుతూ సెర్ప్ ఆధ్వర్యంలో ప్రణాళిక బద్ధంగా అమలవుతున్న ఈ సమ్మర్ క్యాంపులో పెద్ద సంఖ్యలో టీనేజ్ బాలికలు ఉత్సాహంగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సెర్ప్ ఏపీఎం దాసరి నారాయణ మాట్లాడుతూ మే 2 నుండి జూన్ 10 వరకు నిర్వహించబడుతున్న ఈ సమ్మర్ క్యాంపులో కిషోర్ బాలికల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ప్రత్యేకంగా రూపొందించారన్నారు. వివిధ సెషన్ ల ద్వారా బాలికలకు ఆరోగ్యం, భద్రత, విద్య, జీవన నైపుణ్యం పై అవగాహన కల్పిస్తున్నారన్నారు. క్యాంప్ లో భాగంగా బాల్యవివాహాల నిర్మూలన, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. బాలికలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామాజిక సవాళ్ళ ను ఎదుర్కొనే విదంగా షీ టీమ్స్ సహకారంతో భద్రతపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. క్రీడలు, యోగ, స్మార్ట్ఫోన్ వినియోగం, సైబర్ భద్రత,




ఉన్నత చదువులు, కెరీర్ గైడెన్స్ పై దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుమన వాణి, ఎస్సై దామెరుప్పుల దేవేందర్, ఎంఇఓ శ్రీనివాస్, డిఎస్డబ్ల్యూ సునీత, ఐసిడిఎస్ సూపర్ వైజర్ శిరీష, డి హెచ్ ఇ డబ్ల్యూ కళ్యాణి, డీపీఎం పద్మప్రియ ఏపీఎం దాసరి నారాయణ, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శ, కోశాధికారులు స్వప్న, అనిత, రమాదేవి, సెర్ప్ సీసీ లు దుర్గం అనురాధ, నరహరి, అరుణ, పద్మ, గ్రామ సంఘాల ప్రతినిధులు, వివోఏలు, అంగన్వాడీ టీచర్స్, ఆశాలు బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులను వారం రోజుల్లో పరిష్కరించాలి

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

### - హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్- ప్రజావాణి కార్యక్రమానికి 143 వినతులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, కలెక్టర్ సంబంధిత అంశాలపై వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి తక్షణ చర్యలు



తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత పోర్టల్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వారం వారీగా వినతులను పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో వినతులు వచ్చే శాఖలు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కారం చూపాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు మొత్తం 143 వినతులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడులో టీవీకే ఘనవిజయం

## - టీ. నర్సాపురంలో విజయ్ అభిమానుల సంబరాలు

**టీ. నర్సాపురం:మే 4 (నేషనలిస్ట్ వాయిస్)**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ అఖండ మెజారిటీ సాధించి, మూడింట రెండు వంతుల సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న తరుణంలో తెలుగు రాష్ట్రాల్లోనూ పండుగ వాతావరణం నెలకొంది. సోమవారం సాయంత్రం ఏలూరు జిల్లా టీ. నర్సాపురంలో విజయ్ అభిమానులు మరియు బాబు జగజ్జీవాన్ రామ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.

**విజయ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం**

స్థానిక మండలంలో బాబు జగజ్జీవాన్ రామ్ విగ్రహం వద్ద జరిగిన ఈ వేడుకలకు పోలవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చిలకా ఏసుబాబు (సుబ్బు) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యువతతో కలిసి విజయ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. అనంతరం బాణాసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**చరిత్రను పునరావృతం చేసిన విజయ్: ఏసుబాబు**

ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ.. పార్టీ స్థాపించిన కొద్ది నెలల్లోనే ఇంతటి భారీ మెజారిటీ సాధించడం సామాన్యమైన విషయం కాదన్నారు. గతంలో నందమూరి తారక రామారావు, ఎం.జి. రామచంద్రన్ వంటి మహానాయకులకు మాత్రమే ఇలాంటి చారిత్రాత్మక విజయాలు సాధ్యమయ్యాయని, నేడు విజయ్ ఆ చరిత్రను పునరావృతం చేశారని కొనియాడారు.




**అభివృద్ధి బాట:**

కూడు, గూడు, గుడ్డ అనే కనీస అవసరాలతో పాటు నిరుద్యోగ నిర్మూలనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు.

**లినూతన శకం :**

కొత్త పరిశ్రమల స్థాపన, వ్యవసాయ రంగం అభివృద్ధి, ప్రాజెక్టుల నిర్మాణం వంటి హామీలతో తమిళనాడును విజయ్ ప్రగతి పథంలో నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు

**మతతత్వానికి వ్యతిరేకంగా:**




లౌకికవాదాన్ని కాపాడుతూ, అన్ని వర్గాల అభివృద్ధికి టీవీకే కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఈ వేడుకల్లో నార్లపాటి దుర్గారావు, పింగుల మధు, రాయల పీరయ్య, నందిపాము వెంకటేశ్వరరావు, చమటపాము బాబురావు, కోలుకులూరి రాంబాబు, జీజ్జువరపు జయరాజు, పచ్చిగోళ్ళ జాన్, అద్దేపల్లి దుర్గాప్రసాద్, నర్లపాటి వంశీ, జీజ్జువరపు అశోక్ తదితరులు పాల్గొన్నారు. మారుమూల గ్రామాలైన టీ. నర్సాపురం పరిసర ప్రాంతాల్లో సైతం విజయ్‌కు ఇంతటి ఆదరణ ఉండటం విశేషం.

# బెంగాల్‌లో పాగా వేసిన బిజెపి

## - 205 సీట్లతో భారీ విజయం నమోదు

## - మట్టి కరిచిన మమతా బెనర్జీ టిఎంసి

### వ్యూహాత్మక ప్రణాళికతో కాషాయదళం విజయం

**కోల్‌కతా,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

బెంగాల్ దంగల్‌లో బిజెపి గెలిచింది. అనుకున్నట్లుగానే మమతను మట్టి కరిపించింది. టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్ లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు. మొత్తం 293 స్థానాల్లో 205 స్థానాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. మమతా బెనర్జీ పార్టీ 85 స్థానాలకు పరిమితం అయ్యింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిందులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు. నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77 స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే 'పన్నా ప్రముఖ్' వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10-15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30-60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా 'శక్తికేంద్రాలు'గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా నిర్దేశిరచారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్ నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్ స్థాయి సమావేశాల్లో కార్యకర్తలు మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టినట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణెళి లక్ష్యంగా భాజపా పనిచేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను దృష్టిలోపెట్టుకొని వ్యూహాలను అమలు చేసింది. 2021 ఎన్నికల వేళ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసి భాజపా దెబ్బతింది. ఈసారి మాత్రం ఆ తప్పు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అవినీతిని లక్ష్యంగా చేసుకొని భాజపా శ్రేణులు ప్రచారం చేశాయి. 220 నియోజకవర్గాల్లోని టీఎంసీ ఎమ్మెల్యేలపై 'ఛార్జిషీట్లు' విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 10,000 కిలోమీటర్ల మేరకు భాజపా పరివర్తన్ యాత్రను చేపట్టింది. ఫలితంగా 77 మంది అభ్యర్థులను టీఎంసీ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈసారి ఎన్నికల్లో మమతా బెనర్జీకి మొదటి నుంచి అనుకూలించలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే టీఎంసీ అనుకూల అధికారుల బదిలీలు, ఐప్యాక్‌పై ఈడీ దాడులు దీదీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికితోడు ప్రతి 140 మంది ఓటర్లకు ఒక సిబ్బంది చొప్పున మొత్తం 2.4 లక్షల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ నిర్ణయంతో పశ్చిమబెంగాల్‌లో అధికార పార్టీల కార్యకర్తలకు సహజంగా ఉండే దూకుడుకు క్లళెం వేసినట్లైంది. దీనికితోడు సర్ విషయంలో న్యాయస్థానాల వద్ద మమత సర్కారు చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి.

# ఉప ఎన్నికల్లోనూ బిజెపి హవా

## ఏడింటిలో నాలుగు కైవసం

**న్యూఢిల్లీ,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

దేశంలో ఐదు రాష్ట్రాలకు సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడు తున్న తరుణంలోనే దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ బిజెపి సత్తా చాటింది. ఆయా రాష్టాల్లో జరిగిన 7 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలూ వెలువడ్డాయి. ఈ ఏడాది జనవరిలో విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో సహా ఆయా సిట్టింగ్ ఎమ్మెల్యేలు మృతిచెందడం వల్ల ఈ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. మహారాష్ట్రలో రాహురి, బారామతి; కర్ణాటకలో బాగల్‌కోట్, దావణగెరె సౌత్; గుజరాత్‌లో ఉమ్రత్, నాగాలాండ్‌లో కోరిడాండ్, త్రిపురలో ధర్మనగర్‌లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. తాజాగా వీటి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఈ ఏడింట్లో నాలుగు స్థానాల్లో భారతీయ జనతా పార్టీ జయకేతనం ఎగురవేయగా.. మరో మూడింట్లో కాంగ్రెస్ గెలుపొందింది.మహారాష్ట్రలో ఉన్న బారామతి అసెంబ్లీ స్థానం.. రాజకీయ పలుబడి ఉన్న పవార్ కుటుంబానికి కంచుకోట. సిట్టింగ్ ఎమ్మెల్యే అజిత్ పవార్ జనవరి 28న జరిగిన విమాన ప్రమాదంలో మరణించడంతో ఆ స్థానంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన భార్య, నేషనలిస్ట్ కాంగ్రెస్ అజిత్ వర్గం అభ్యర్థి సునేత్ర అజిత్ పవార్ ఆ స్థానం నుంచి పోటీ చేశారు. 2,18,034 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. మరో స్థానం రాహురిలో కాంగ్రెస్ అభ్యర్థి గోవింద్ మొకాతెపై 1,12,587 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి అక్షయ్ శివాజీరావ్ ఘన విజయం సాధించారు. ఇక.. కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో కాంగ్రెస్ నేత ఉమేశ్ హుళ్లప్ప మేటి 22,332 ఓట్ల తేడాతో బీజేపీపై గెలుపొందారు. బీజేపీ తరఫున చరన్‌మితత్ వీరభద్రయ్య(వీరన్న) పోటీ చేశారు. కర్ణాటకలోని దావణగెరె సౌత్‌లోనూ కాంగ్రెస్ విజయ దుందుభి మోగించింది. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస టి.దాసకరియప్పపై 5,708 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి సమర్థ్ మల్లికార్జున విజయం సాధించారు.గుజరాత్‌లోని ఉమ్రత్‌లో బీజేపీ అభ్యర్థి హర్షత్‌భాయ్ గోవింద్‌భాయ్ పర్మార్ 30,743 ఓట్ల తేడాతో కాంగ్రెస్ నేత భృగురాజ్ సింగ్ చౌహాన్‌పై ఘన విజయం సాధించారు. హర్షద్ పర్మార్‌కు 85,500 ఓట్లు రాగా, భృగురాజ్‌కు 54,757 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే గోవింద్ పర్మార్ మృతిచెందిన కారణంగా ఈ ఉప ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే. అక్కడ గోవింద్ కుమారుడు, హర్షత్ భాయ్ విజయం సాధించడం విశేషం. నాగాలాండ్‌లోని కోరిడాండ్‌లో బీజేపీ అభ్యర్థి దావోచియర్ ఐ.ఇమ్‌చన్, ఇండిపెండెంట్ అభ్యర్థి తోషికాబా మధ్య గట్టి పోటీ నెలకొంది. ఇందులో ఇండిపెండెంట్ అభ్యర్థి తోషికాబాపై 3,123 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి దావోచియర్ గెలుపొందారు. త్రిపురలోని ధర్మనగర్‌లో సీపీఐ(మార్క్సిస్ట్) అభ్యర్థి అమితాబ్ దత్తపై 18,290 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి జహర్ చక్రబరోటి విజయం సాధించారు.

# ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తూ డివిజనల్ స్థాయిలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో హనుమకొండ జిల్లాలోని హనుమకొండ, పరకాల ఆర్డిఓ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. హనుమకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో రాథోడ్ రమేష్, పరకాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి 10 దరఖాస్తులు అందగా, పరకాల ఆర్డీవో కార్యాలయం లో 27 అర్జీలు ప్రజల నుండి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# అరాచక పాలన అంతం

## - మోదీ నాయకత్వం దేశానికి శ్రీరామరక్ష

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్





తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 4 (నేషనలిస్ట్ వాయిస్)

దేశంలో జరిగిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయకేతనశీ ఎగరవేయటం శుభ పరిణామమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.

పశ్చిమబెంగాల్, పాండిచ్చేరి అస్సాం, రాష్ట్రాల్లో బిజెపి ఘన విజయాన్ని పురస్కరించుకుని ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో ప్రయాణిస్తుందని, ఆయన నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.

దేశాన్ని సమర్థవంతంగా నడిపించే నేత నరేంద్ర మోదీ అని ప్రజలు విశ్వసించి, రాస పాలలకు అంతం పలికారని వివరించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ 15 ఏళ్ల పాటు తీవ్రస్థాయిలో అరాచక పాలన సాగించిన మమతా బెనర్జీ పరిపాలన కు చరమగీతం పాడి, నీతివంతమైన పరిపాలనను అందించే భాజపాకు పట్టం కట్టారని తెలిపారు. యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండలు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సాధించిన ఈ ఘనవిజయంతో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కి నిజమైన నివాళి దక్కిందని కొనియాడారు. బిజెపి నరసాపురం పార్లమెంటరీ మీడియా ఇన్చార్జి నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ తో పాటు దేశ ప్రజలంతా నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకు నిదర్శనమే ఈ అపురూప విజయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల, జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, అడపా రమేష్, పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, కంచిమర్తి నాగేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, యువ మోర్చా పట్టణ అధ్యక్షులు కంచర్ల రాజా, జిల్లా అధ్యక్షులు పచ్చ గోపాలకృష్ణ, పట్టణ కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ, సన్నిధి లక్ష్మీ దుర్గ, కర్రీ విజయ్ కుమారి, మహిళా మోర్చా జిల్లా మాజీప్రధాన కార్యదర్శి ఎన్నేటి వెంకటలక్ష్మి, అచ్యుత దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

## - భారీగా బందోబస్తు ఏర్పాటు- బెంగాల్ కౌంటింగ్‌పై ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ,మే4 (నేషనలిస్ట్ వాయిస్)

దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం పకడ్బందీగా చేపట్టారు. భారీ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు సాగింది. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా భద్రత ఏర్పాటు చేశారు. బెంగాల్లో మరిన్ని బలగాలను మొహరించారు. టీఎంసీ, బీజేపీ మధ్య నువ్వా –నేనా అన్నట్లుగా పోటీ ఉన్న బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు వేళ..ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సీఎం మమతాబెనర్జీ సిద్ధమయ్యారు. ఆదివారమే తన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు ఆ మేరకు దిశా నిర్దేశంచేశారు. బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలకు గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఆయా రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బాలెట్లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యింది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు భిన్న ఫలితాలను అంచనా వేయటంతో పోటీచేసిన రాజకీయ పార్టీల్లో ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈసీ చర్యలు తీసుకుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా అడ్డుకోవడానికి తొలిసారి క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టింది. తాజా ఎన్నికల్లో అందరి దృష్టి పశ్చిమ బెంగాల్‌పైనే నిలిచింది. ఇక్కడ 294 అసెంబ్లీ స్థానాలుండగా, నేడు 293 స్థానాల ఫలితాలను ప్రకటించనున్నారు. ఫాల్టా నియోజకవర్గంలో పోలింగ్‌ను ఈసీ రద్దుచేసింది. ఇక్కడ ఈ నెల 21న పోలింగ్ జరగనుంది. ఆమె పోటీ చేసిన భవానీపూర్ నియోజకవర్గం ఫలితంపైఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇక్కడ ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి నిలబడ్డారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఆయన మమతను ఓడించారు. బెంగాల్‌లో గత నెల 23, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. దేశ చరిత్రలోనే అత్యధికంగా 92.47శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో ఓట్ల లెక్కింపు కోసం దాదాపు 2.5 లక్షల మంది కేంద్ర బలగాలను నియమించారు. కేరళలో పోలింగ్‌కు ముందే కీలక పరిణామం చోటుచేసుకుంది. వామపక్ష కూటమి ఎల్డీఎఫ్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించి చరిత్ర సృష్టించినసీఎం పినరయ్ విజయన్.. తనకు తానుగా సీఎం పేరును వదిలేసుకొని సంచలనం సృష్టించారు. తన సోషల్‌మీడియా ఖాతాలో ఆదివారం ఆయన కేరళ ముఖ్యమంత్రి అనే పదాన్ని తొలగించి సీపీఐఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అనే పదాలను చేర్చారు. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఈసారి ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి గెలుపు ఖాయమని ఎక్కువ శాతం ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవటంపై బీజేపీ ధీమాగా ఉంది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు కూడా మళ్లీ బీజేపీదే అధికారమని ప్రకటించాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తోంది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరిగింది. 2.50 కోట్ల ఓటర్లున్న ఇక్కడ.. 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు కోసం 40 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 722 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మొత్తం 30 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు కూడా ఉదయమే ప్రారంభం అయ్యింది. ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి నేతృత్వంలోని 'ఏఐఎన్‌ఆర్‌సీ – బీజేపీ' కూటమిదే మళ్లీ అధికారమని సర్వేలు తెలిపాయి.

# నకిలీ నోట్లను చలామణి చేస్తున్న ఎనిమిది వ్యక్తులు అరెస్టు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)



నకిలీ నోట్లను తయారుచేసి (ప్రింట్ తీసి) మార్కెట్లో చలామణి చేస్తున్న ముగ్గురు వ్యక్తులను తెలంగాణలో తక్కువ డబ్బులకు, ఎక్కువ డబ్బులను 1:3 లో తయారు చేసి ఇస్తామని చెప్పి కోరిన వారికి రూపాయలు 500 నోట్ల పరిమాణంలో నల్ల కాగితాలను ఇస్తూ మోసాగిస్తున్న ఐదుగురు వ్యక్తులను వరంగల్ టాస్క్ ఫోర్స్ నర్సంపేట పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితుల నుండి నకిలీ నోట్లను, 1,48,000 రూపాయలను సుమారు 28 లక్షల విలువగల ల్యాప్ టాప్ లు, ప్రింటర్స్, 13 సెల్‌ఫోన్లు రెండు కార్లను స్వాధీన పరుచుకున్నారు.

అరెస్టు చేసిన నిందితులు

1) శాగంటి కిరణ్, నివాసం: నర్సంపేట;
2) నీరటి శివ, నివాసం: నర్సంపేట
3) నీరటి రంజిత్, నివాసం: నర్సంపేట,
4) గుడికందుల రవి, నివాసం: నర్సంపేట;
5) పోరిక రాజ్‌కుమార్ ఏ రాజు, నివాసం: ఘన్ పూర్ (ములుగు),
6) తనమాల రాజశేఖర్, నివాసం: వేంసూరు, ఖమ్మం;
7) ముదురుకోల యాకంబరం, నివాసం: తాతానగర్, భువనగిరి;
8) చేను సాయికిరణ్, నివాసం: కారకగూడెం (మండలం), కొత్తగూడెం కు చెందినవారిగా పోలీసులు గుర్తించారు.

ఈ అరెస్టుకు సంబంధించి ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ వివరాలను వెల్లడిస్తూ, నర్సంపేట కు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపు లోకి తీసుకొని విచారించగ వారు అసలు 100 రూపాయలు నోట్లను ల్యాప్ టాప్ అండ్ ప్రింటర్ ద్వారా కలర్ ప్రింట్ తీసి మార్కెట్లో అసలు నోట్లుగా చలామణి చేస్తున్నారని మిగిలిన ఐదుగురు వ్యక్తులను విచారించగ వారు తెలంగాణ రాష్ట్రంలో తక్కువ డబ్బులకు, ఎక్కువ డబ్బులను 1:3 లో తయారుచేసి ఇస్తామని చెప్పి వారు బాధితులను నమ్మించడానికి, అసలైన 500 రూపాయల కరెన్సీ నోట్లను అయోడిన్ టింక్చర్ ద్రావణంలో ముంచడం ద్వారా వాటిని నల్లగా మార్చి, ఆపై 'హైపో' (సోడియం థయోసల్ఫేట్) ద్రావణంలో ముంచగ, రసాయన చర్య ఫలితంగా వాటి అసలు రూపాన్ని తిరిగి వచ్చేలా చేసి, వారి ప్రణాళిక ప్రకారం, వారు నల్లటి రంగు కాగితాలను కట్టలుగా కట్టి, కోరినవారికి ఇచ్చి, వారు పైన చెప్పిన విదంగా చేసినట్లయితే, అవి అసలు నోట్లలాగా మారుతాయని నమ్మించి, వారి వద్ద నుండి అసలు నోట్లు తీసుకొని పరారు అవుతారు. వారు గతంలో ఘనపూర్ (ములుగు), మోండా మార్కెట్ (సికింద్రాబాద్), వెంసూర్, కొత్తగూడెం, కె యు సి సుబేదారీ పరిధిలో మోసం చేయగా వారిపై కేసులు నమోదు చేసి, జైల్ కు పంపడం జరిగింది. తెలంగాణలో చత్రినాక (హైదరాబాద్) నర్సంపేటలో మోసం చేసినట్లు తెలిపినారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసిపి మదుసూధన్, నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ బాబులాల్, నర్సంపేట ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎఎఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ నర్సంపేట సిబ్బందిని సిపి అభినందించారు.




# అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం

## - జలుక్‌బరి నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో సిఎం గెలుపు

గువాహటి,మే4 (నేషనలిస్ట్ వాయిస్)

అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. 126 స్థానాలు ఉన్న అసోంలో బిజెపి వందకు పైగా సీట్లను గెల్చుకుని తిరుగులేదని నిరూపించింది. ఇక్కడ కాంగ్రెస్ నేత గోగోయ్ అపజయం పాలయ్యారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. హిమంత సైతం తన సొంత నియోజకవర్గమైన జలుక్‌బరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన బిదిష నియోగ్‌కు 31,951 ఓట్లు పోలయ్యాయి. హిమంత బిశ్వ శర్మ 2015లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. 2021 నుంచి అస్సాంలో బీజేపీకి కీలకనేతగా నిలిచారు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను వ్యతిరేకించడం, ఆదివాసీ భూములను చొరబాటుదారుల నుంచి విముక్తి కలిగించడంతో ముఖ్యమంత్రిగా అన్ని ప్రధాన వర్గాలుగా చేరువయ్యారు. ముఖ్యంగా చికెన్‌నెక్ కారిడార్‌పై బంగ్లా ప్రకటనలు తిప్పికొట్టడం, బెలూచిస్థాన్ స్వాతంత్ర పోరాటానికి మద్దతుగా నిలవడం, అసాంలో వరద నివారణ చర్యలు తీసుకోవడం వంటి చర్యల ద్వారా ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బంగ్లా చొరబాట్లకు పూర్తి అడ్డుకట్ట వేస్తామని, ఎన్ఆర్‌సీని కచ్చితంగా అమలవుతుందని ఆయన చేసిన ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంది. ప్రధానమంత్రి మోదీ సైతం హిమంత్ బిశ్వ శర్మ ప్రచారానికి దన్నుగా నిలవడంతో అస్సాంలో బీజేపీ తిరుగులేని విజయాన్ని మరోసారి సొంతం చేసుకుంది.

# నెల్లూరు జిల్లాలో మహానాడు

## మహానాడు కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## జిల్లా పర్యటనలో మంత్రి నారాయణ వెల్లడి

**నెల్లూరు,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**



తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వహించే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ వెల్లడించారు. మహానాడును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహానాడును ఇఫ్కోసెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీన పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసుకుంటామని.. ప్రజలకు పలు హామీలు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మహానాడుకు రానున్నారని చెప్పుకొచ్చారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి నారాయణ మరోసారి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) ఉదయం నెల్లూరు జిల్లాలోని దస్తగిరి నగర్‌లో రూ.1.43 కోట్లతో చేపట్టబోయే సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంపై గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపి వెళ్లిందని... పరిశ్రమలు వెళ్లిపోయాయని.. రియల్ ఎస్టేట్ పడిపోయిందని విమర్శించారు. అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సీఎం చంద్రబాబు అనుభవంతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని తెలిపారు. యువనేత లోకేశ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఈ ఏడాది దేశంలో వచ్చిన పరిశ్రమల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని తెలిపారు. పరిశ్రమలు వస్తే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని చెప్పుకొచ్చారు. 'మహానాడు ఎక్కడ పెట్టాలో చెప్పటానికి వైసీపీ నేతలు ఎవరు? మా పార్టీ అధినేత నిర్ణయిస్తారు' అని అన్నారు. వైసీపీ తీరు మార్చుకోకపోతే ఆ పదకొండు సీట్లు కూడా ఈసారి రావని.. జనం గుండు సున్నా పెడతారంటూ మంత్రి నారాయణ హెచ్చరించారు.

# తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతం

## - ద్రవిడ పార్టీల పాలనకు చరమగీతం అనూహ్యంగా

## దూసుకు వచ్చిన విజయ్ పార్టీ - మ్యాజిక్ ఫిగర్‌కు చేరువగా టివికె

## ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందు చేసిన ఫలితాలు-తమిళనాడు


## సిఎం స్టాలిన్ ఘోర పరాజయం

## ఆయన బాటలోనే అత్యధిక మంత్రులు ఓటమి

## పెద్దగా ప్రభావం చూపని బిజెపి నేతలు

**చెన్నై,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతమయ్యింది. అనూహ్యంగా దూసుకు వచ్చిన నటుడు విజయ్ పార్టీ తమిళనాట జెండా పాతింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ ద్రవిడ పార్టీలను మట్టి కరిపించింది. అధికార డిఎంకెను ఓ కుమ్ము కుమ్మింది. తమిళనాట హిందీ వ్యతిరేకత, దక్షిణాదికి అన్యాయం అంటూ హుంకరించిన సిఎం స్టాలిన్ పార్టీ ఓడడమే గాకుండా స్వయంగా ఆయన కూడా ఓడిపోయారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళసై సైతం వరుసగా రెండోసారి ఓటమిదిశలో ఉన్నారు. ఒకప్పటి తన అనుచరుడు, డిఎంకె పార్టీ నేత చేతిలో దారుణంగా ఓటమి చెందారు. ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం విజయం దిశగా ఉన్నారు. మంత్రులు చాలామంది ఇంటి ముఖం పట్టారు. ఇక టీవీకే చీఫ్ విజయ్.. పెరంబూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తాజా సమాచారం ప్రకారం టివికె 108 స్థానాల్లో, 59 స్థానాల్లో డిఎంకె, 44 స్థానాల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు లీడింగ్‌లో ఉన్నారు. చెన్నై, చంగల్‌పట్టు, కంచీపురం, తిరువల్లూరులో టివికె విజయ కేతనం ఎగురవేసింది.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో ద్రావిడ్ పార్టీల ఆధిపత్యం ఉండేది. సెంట్రల్ తమిళనాడులోనూ టీవీకే మంచి పోటీ ఇచ్చింది. తిరుచిరాపల్లి, తాంజావురు, కరూర్, పెరంబలూరు, అరియాలూరు, నాగపట్టణం, తిరువరూరు, పుడుకొట్టై, మలదుతరై జిల్లాలో టివికె గట్టి పోటీనిచ్చింది. దీంతో దళపతి ఇక కొత్త సిఎంగా కావడం అనివార్యం అయ్యింది. చిన్నా చితక పార్టీలు లేదా అన్నడిఎంకెతో పొత్తు కుదిరితే సరిపోతుంది. మొత్తంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో దళపతి విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. తన రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కళగం ద్వారా ఎన్నికల బరిలోకి దిగిన ఆయన, దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రావిడ పార్టీలను విస్మయానికి గురిచేశారు. తాజా ట్రెండ్స్ ప్రకారం, విజయ్ నేతృత్వంలోని టీవీకే ఏకంగా 109 స్థానాల్లో ముందంజలో ఉండి, రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించే దిశగా దూసుకుపోతోంది. సినిమా స్టార్‌లు రాజకీయాల్లో రాణించలేరన్న అపవాదును చెరిపివేస్తూ, విజయ్ తన సినీ పాపులారిటీని ఓట్లుగా మార్చుకోవడంలో సఫలమయ్యారు. తద్వారా దివంగత నేతలు ఎన్టీ రామారావు, ఎంజీ రామచంద్రన్, జయలలిత వంటి దిగ్గజాల సరసన ఆయన నిలిచారు. 1977 తర్వాత తమిళనాడులో డీఎంకే, ఏఐఏడీఎంకే కాకుండా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయడం ఇదే తొలిసారి.పార్టీ అధికార ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ.. 'ఇది కుటుంబ రాజకీయాలకు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు. ఎవరి మద్దతు లేకుండానే మేము సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. విజయ్ నివాసం వద్ద ఆయన కుటుంబ సభ్యులు పార్టీ గుర్తు అయిన 'విజిల్' సాంగ్‌తో సంబరాలు చేసుకున్నారు. మెజారిటీ మార్కు 118కి టీవీకే చేరువలో ఉంది. చిన్న పార్టీల మద్దతుతో లేదా స్వతంత్రంగా విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ, జెండాలు ఊపుతూ పండుగ చేసుకున్నారు. ఇకపోతే ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఓడిపోయారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన..టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 9వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. కొళత్తూరు నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన సీఎం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేక పోయారు. 1996 తర్వాత స్టాలిన్ ఓడిపోవడం ఇదే తొలిసారి. ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ టీవీకే గెలుపు దిశగా దూసుకుపోతోంది. స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం ఆధిక్యంలో కొనసాగుతున్నారు. వీఎస్ బాబుకు 82 వేల పైచిలుకు ఓట్లు రాగా, స్టాలిన్‌కు దాదాపు 73 వేల ఓట్లు పోలయ్యాయి. అన్నాడీఎమ్‌కేకు చెందిన సంతానకృష్ణన్ దాదాపు 14 వేల ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. 1996 తరువాత డీఎమ్‌కే అధినేతకు ఓటమి ఎదురు కావడం ఇదే తొలిసారి. వీఎస్ బాబు గతంలో డీఎమ్‌కే, ఏఐఏడీఎమ్‌కే పార్టీల్లో సేవలందించారు. 2006-11 మధ్య పురసవల్కం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2011 వరకూ డీఎమ్‌కే ఉత్తర చెన్నై డిస్ట్రిక్ట్ సెక్రటరీగా కూడా ఉన్నారు. 2011 నాటి ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా కూడా ఉన్నారు. ఆ ఎన్నికల్లో సీఎం స్టాలిన్‌కు మెజారిటీ తగ్గడంతో విమర్శల పాలయ్యారు. అనంతరం అన్నాడీఎమ్‌కేలో చేరారు. ఈ ఏడాది నటుడు విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీలో చేరారు. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టిన విజయ్ సారథ్యంలోని టీవీకే విజయపథంలోకి దూసుకెళ్తోంది. అయితే మెజారిటీకి 118 సీట్లు అవసరమవుతాయి. మెజారిటీ తగ్గిన పక్షంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఏయే పార్టీలతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందనే దానిపై తాజాగా సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకునేది లేదని టీవీకే ఇంతకుముందే ప్రకటించింది. అయితే టీవీకే మెజారిటీకి అతి దగ్గరలో ఆగిపోయిన పక్షంలో ఆ పార్టీ మద్దతు తీసుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని



అంటున్నారు. కాగా, సెక్యులర్ ప్రొగ్రసివ్ అలెయెన్స్‌లో భాగంగా డీఎంకేతో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకున్నాయి. ట్రెండ్స్ ప్రకారం కాంగ్రెస్ 5 స్థానాల్లో, సీపీఐ రెండు స్థానాల్లో, సీపీఎం ఒక స్థానంలో గెలుపునకు చేరువలో ఉన్నాయి. డీఎంకేతో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్నప్పటికీ ఆ పార్టీలోని కొందరు టీవీకే పట్ల సానుకూలంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్‌లోని ఒక వర్గం మొదట్నించీ పట్టుపడుతోంది. అయితే చివరి నిమిషంలో డీఎంకేతోనే కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు తీసుకునే అవకాశాలు బలంగా ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా టీవీకే ఇటు కాంగ్రెస్‌తో పాటు ఐయూఎంఎల్, డీఎండీకే, లెఫ్ట్ పార్టీల సాయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. డాక్టర్ అన్బుమణి రామదాస్ సారథ్యంలోని పీఎంకే మద్దతును కూడా టీవీకే కూడగట్టవచ్చని చెబుతున్నారు. ఏదిఏమైనా పూర్తి ఫలితాలు వెలువడిన తర్వాతే టీఎంకే వ్యూహరచన ఉంటుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

# ఎన్నికల ఫలితాల ప్రభావం

## - లాభాలతో ముగిసిన

## స్టాక్ మార్కెట్లు

**ముంబై,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో పాటు ఎన్నికల ఫలితాలు కూడా ప్రభావం చూపించడంతో సెన్సెక్స్ 355.90 పాయింట్ల లాభంతో 77,269.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 77,910.75 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మరోవైపు నిఫ్టీ కూడా 121.75 పాయింట్ల లాభంతో 24,119.30 వద్ద స్థిరపడింది. నేడు హెచ్‌యూఎల్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ సంస్థల షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, ఇన్ఫోసిస్ నష్టాలను చవిచూశాయి. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.08 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 113 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఔన్స్ 24 క్యారెట్ బంగారం ధర 4545 డాలర్లుగా ఉంది. క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర ఇప్పటికీ 100 డాలర్లకు పైనే ఉండటం, ద్రవ్యోల్బణం భయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వారం సూచీలు ఒడిదుడుకులు ఎదుర్కొనే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# తమిళనాట టివికె పార్టీ జోరు

## - పతనమైన సన్ టివి షేర్లు

**చెన్నై,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

గత కొన్ని దశాబ్దాలుగా తమిళనాడు రాజకీయాలు డీఎంకే, ఏడీఎంకే చుట్టే తిరుగుతున్నాయి. అయితే డీఎంకే, లేదంటే ఏడీఎంకే అధికారంలోకి వస్తూ ఉన్నాయి. ఎన్నో సంవత్సరాల తర్వాత మూడో పార్టీ ఈ రెండింటినీ వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి వచ్చింది. నటుడు విజయ్ స్థాపించిన టీవీకే.. బరిలోకి దిగిన తొలి ఎన్నికల్లోనే సత్తా చాటింది. అన్నా డీఎంకే, డీఎంకే పార్టీలను వెనక్కి నెట్టిన టీవీకే ప్రస్తుతం ఆధిక్యంలో కొనసాగుతోంది. ఈ ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. విజయ్ జోరు కారణంగా డీఎంకే నేత, స్టాలిన్‌కు బంధువైన కళానిధి మారన్‌కు చెందిన సన్ టీవీ నెట్‌వర్క్ షేర్లు పతనమయ్యాయి. ఇప్పటివరకు అధికారం అనుభవించిన డీఎంకే తాజా ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైంది. దీంతో సన్ టీవీ షేర్లు దాదాపు 9.5 శాతం మేర పతనమయ్యాయి. ఒక దశలో సన్ టీవీ నెట్‌వర్క్ షేర్ 9.5 శాతం మేర పతనమై 547.55 వద్ద కనిష్ఠానికి చేరింది. అయితే ఆ తర్వాత కాస్త కోలుకుంది. మధ్యాహ్నం 1:45 గంటల సమయంలో 6 శాతం నష్టంతో 566 వద్ద కొనసాగుతోంది. కాగా, ఉదయం భారీ లాభాలతో ప్రారంభమైన సూచీలు తర్వాత కిందకు దిగివచ్చాయి. ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో దాదాపు 1000 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ ప్రస్తుతం 339 పాయింట్ల లాభంతో 77,252 వద్ద కొనసాగుతోంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. సోమవారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,920గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,340గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,51,220గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,490గా ఉంది. రోవైపు వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,69,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,69,900గా, బెంగళూరులో రూ.2,64,900గా ఉంది.

# ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం

## సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు

## బ్రేక్‌డౌన్ అయినప్పుడు 14449కు ఫోన్ చేయండి

## వాహనదారులకు కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచన చేశారు. ఇటీవల కాలంలో ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పలు సూచనలు చేశారు. ఈ మేరకు సజ్జనార్ ఓ ప్రకటన విడుదల చేశారు. వాహనాల బ్రేక్ డౌన్, మెడికల్ ఎమర్జెన్సీ వంటి బలమైన కారణాలు ఉంటే తప్ప, సెల్ఫీలు దిగడానికి లేదా విశ్రాంతి తీసుకోవడానికి వాహనాలను రోడ్డు పక్కన నిలపడం చట్టరీత్యా నేరమని.. అత్యంత ప్రమాదకరమని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఒకవేళ మీ వాహనం ఆగిపోతే, తక్షణమే 14449 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. వీరు మీకు తగిన సహాయం అందించడమే కాకుండా, ఇతర వాహనదారులను అప్రమత్తం చేసే ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో వాహనాన్ని నిలపాల్సి వస్తే, వేగంగా వచ్చే ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఎడమ వైపు ఉన్న లైన్‌లో మాత్రమే నిలపాలని సీపీ సజ్జనార్ సూచించారు. వాహనం ఆపినప్పుడు, వెనుక నుంచి వచ్చే వారికి కనీసం 50 నుంచి 100 మీటర్ల దూరం నుంచే తెలిసేలా 'రిఫ్లెక్టివ్ ట్రయాంగిల్స్' లేదా ఇతర హెచ్చరిక గుర్తులను ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనం ఆపి ఉన్నంత సేపు హజార్డ్ లైట్లను (నాలుగు ఇండికేటర్లు) ఆన్ చేసి ఉంచడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని అన్నారు. క్షఖీఖీపై వాహనాల వేగ పరిమితి గంటకు 120 కిలోమీటర్ల వరకు పెంచిన నేపథ్యంలో, ఒక్క చిన్న పొరపాటు కూడా భారీ ప్రాణ నష్టానికి దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నిబంధనలను పాటించి మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# తమిళనాట విజయ్ పార్టీ ఆధిక్యం

- విజయ్ ఇంటి వద్ద పోలీస్ బలగాల మోహరింపు
- విజయోత్సవాల్లో విజిలస్ వేసిన కుటుంబ సభ్యులు

**చెన్నై,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో టీవీకే సత్తా చాటుతోంది. దీంతో గెలుపు అవకాశాలు కనిపిస్తున్న వేళ ఆ పార్టీ అధినేత విజయ్ ఇంటి వద్ద అధికారులు భద్రత పెంచారు. భారీగా చేరుకున్న పోలీస్ బలగాలు అక్కడ మోహరించాయి. ప్రస్తుతం విజయ్ పార్టీ 100కు పైగా స్థానాల్లో అధిక్యంలో హవా కొనసాగిస్తోంది. ఈనేపథ్యంలో విజయ్ ఇంటి వద్దకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీగా వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇతర వాహనాలను ఆయన ఇంటివైపు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు తాజా ఎన్నికల కమిషన్ ట్రెండ్స్ ప్రకారం విజయ్ నేతృత్వంలోని తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన టీవీకే అనూహ్యరీతిలో రాణిస్తోంది. విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత పోటీ చేసిన మొదటి ఎన్నికల్లోనే ఈ స్థాయి ఆధిక్యాన్ని ప్రదర్శించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ హవా కొనసాగుతోంది. నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ఆధిక్యంలో ఉంది. దీంతో విజయ్ ఇంట్లో సంబరాలు మొదలయ్యాయి. విజయ్ కుటుంబ సభ్యులు విజిల్స్ ఊదుతూ సంబరాలు చేసుకున్నారు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది టీవీకే భారీ ఆధిక్యం దిశగా సాగుతుండడంతో టీవీకే నేతలు, విజయ్ అభిమానులు సంతోషంలో మునిగి తేలుతున్నారు. ప్రస్తుతానికి విజయ్ టీవీకే 105 స్థానాల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఏడీఎంకే 71 సీట్లోలనూ, డీఎంకే 57 స్థానాల్లోనూ లీడింగ్‌లో ఉన్నాయి. కాగా, 234 సీట్ల తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుత ట్రెండ్ ప్రకారం చూస్తుంటే మెజారిటికీ దగ్గరగా విజయ్ పార్టీ వచ్చేలా కనిపిస్తోంది. ఒకవేళ హంగ్ ఏర్పడితే ఏడీఎంకేతో కలిసి టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా విజయ్ తమిళనాడు తదుపరి సీఎం అయ్యే అవకాశాలు పుష్కలంగా కనబడుతున్నాయి.



# తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఆగివున్న లారీని ఢీకొన్న అంబులెన్స్

## రోగి సహా నలుగురు దుర్మరణం

**శ్రీకాళహస్తి,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**

తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు కాగా.. వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోల్‌కతా నుంచి ఓ రోగిని చికిత్స నిమిత్తం బెంగళూరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. ఓరందూరు వద్ద హైవే పక్కన నిలిపి ఉన్న లారీని వెనకనుంచి ఢీ కొట్టింది. అంబులెన్స్‌లో డ్రైవర్‌తో సహా ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాయుడుపేట – రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద ఆగి ఉన్న లారీని అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఒక రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై అప్పటికే నిలిపి ఉంచిన లారీని అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా ఉన్న మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని ప్రాథమిక సమాచారం. వీరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శ్రీకాళహస్తి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు.

# బెంగాల్ గడ్డపై ప్రజాస్వామ్య విజయం - మహిళా శక్తికి తలవంచిన అరాచక శక్తులు

## - కేసరి ఆంజనేయులు గౌడ్

## బిజెపి ఆత్మ నిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో పశ్చిమ బెంగాల్‌తో పాటు అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో సరికొత్త శకానికి నాంది పలికాయని బీజేపీ ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. రెబ్బెన మరియు గోలేటి కేంద్రాల్లో జరిగిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని బాణాసంచా కాల్చి, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల పోరాట ఫలితం బెంగాల్‌లో హింసాత్మక రాజకీయాలను, అణిచివేత ధోరణిని ఎదిరించి బీజేపీ సాధించిన ఈ విజయం చారిత్రాత్మకం. ఇది పార్టీ సిద్ధాంతానికి, కార్యకర్తల నిరంతర శ్రమకు దక్కిన ప్రతిఫలం.నారీశక్తి విశ్వరూపం మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న పార్టీలకు మహిళలే తమ ఓటుతో చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చారు. మహిళా శక్తి ఇప్పుడు కేవలం ఓటు బ్యాంక్ కాదు, అది దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి.

మోదీ అభివృద్ధి మంత్రం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రజలు పారదర్శకతను, అభివృద్ధిని కోరుకుంటున్నారని ఈ ఫలితాలు నిరూపించాయి.

దక్షిణాదిలో మార్పు గాలి కేరళ, తమిళనాడు ప్రజలు కూడా మార్పును కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఇదే ఉత్సాహంతో బీజేపీ మరింత బలోపేతం అవుతుంది.

"నారీశక్తి ఎదిగితేనే దేశం ఎదుగుతుందని" నమ్మే బీజేపీ, మహిళల హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కొనిపాక కిరణ్ రెబ్బెన మండల అధ్యక్షులు మల్రాజు రాంబాబు. జిల్లా నాయకులు గుల్బం చక్రపాణి ఎలమంచి సునీల్ చౌదరి కుందారపు బాలకృష్ణ రాజు అగర్వాల్ ఇగురపు సంజీవ్. మండల నాయకులు దుర్గం తిరుపతి కొయ్యడ మహేందర్ గౌడ్ పందిర్ల కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.



# యస్ ఆర్ యస్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలో బారేగూడ మెయిన్ రోడ్ జ్యోతిరావ్ పూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహాల సమీపంలో శ్రీ శివరామసాయి యూత్ వెల్ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు.ఈ చలివేంద్రం గ్రామస్థులతో యూత్ సభ్యులతో కలిసి యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ యూత్ ప్రధానకార్యదర్శి తూమోజు వెంకటేష్ ప్రారంభించారు

ఈ సంద ర్భంగా యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో వాహనదారులకు బాటసారుల దాహార్తిని తీర్చడమే తమ లక్ష్యమని తెలిపారు.పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు బాటసారుల సౌకర్యార్థం శ్రీ శివరామసాయి యూత్ వెల్పర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.వేసవి తాపాన్ని తట్టుకోవడానికి సామాన్యులు బాటసారులకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.వాహన దారులకు బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు బారెగుడా గ్రామ మెయిన్ రోడ్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహాల సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రతి రోజూ చల్లటి నీరు అందిస్తున్నట్లు యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాలి సంఘం మండల అధ్యక్షుడు నీకోడే సందీప్ యూత్ ముఖ్య సలహాదారులు ఎద్దు ప్రకాశ్ కార్యదర్శి మోర్లే రవి గ్రామ పెద్దలు మోర్లే రామయ్య గ్రామస్తులు శ్రీనివాస్ మధుకర్ యూత్ సభ్యులు మోహన్ సాయి తిరుపతి బన్నీ తదితరులు పాల్గొన్నారు.




# అవినీతిని ప్రశ్నించినందుకే క్రిశాంక్ అరెస్ట్

## జైలులో బిఆర్ఎస్ నేతకు పరామర్శ

## ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని కెటిఆర్ ఆరోపణలు

**సంగారెడ్డి,మే4 (నేషనలిస్ట్ వాయిస్)**



కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే మన్నే క్రిశాంక్‌ని అన్యాయంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని ధ్వజమెత్తారు. ఆయనపై 35 కేసులు పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహించారు. బీఆర్ఎస్, సోషల్ మీడియాపై పెట్టిన శ్రద్ధలో ఒక్క పైసా అయిన.. సీఎం శాంతిభద్రతలపై దృష్టి పెడితే బాగుంటుందని హితవు పలికారు. సోమవారం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేరుకున్నారు. జైల్లో ఉన్న మన్నే క్రిశాంక్‌తో వారు ములాఖత్ అయ్యారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కేపీ వివేకానంద్, పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. మన్నె క్రిషాంక్ ఓ ఉన్నత విద్యావంతుడు, న్యాయవాది, పీహెచ్‌డీ పట్టా పొందిన వ్యక్తి. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమంలో ముందుండి పోరాడిన ఆయన, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత టీఎస్ఎండీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తూ ప్రజల ముందుకు తీసుకువస్తున్నందుకే క్రిషాంక్‌పై వరుసగా కేసులు నమోదు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. నాలుగేళ్ల కంటే తక్కువ శిక్ష ఉన్న కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన పరిస్థితిలో 12 రోజులుగా జైలులో పెట్టి 'హ్యాబిచువల్ అఫెండర్'గా చూపించడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయాలను ప్రశ్నించినందుకే కేసులు పెట్టారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా సోషల్ మీడియా పోస్టులపై కేసులు పెట్టడంలోనే బిజీగా ఉందని కేటీఆర్ విమర్శించారు. కరీంనగర్‌లో పగటిపూట కాల్పులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. కానీ, ఎవరు ట్వీట్ చేశారు అన్నదానిపై మాత్రం అప్రమత్తంగా ఉందని ఎద్దేవా చేశారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ పోలీసులు ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీలా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్, హ్యాకింగ్, జర్నలిస్టులపై వేధింపులు వంటి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. హైకోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా క్రిషాంక్‌ను అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయంపై కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ వేస్తామని తెలిపారు.మా నాయకులను వేధించినా మేము వెనక్కి తగ్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు మా పోరాటం కొనసాగుతుందన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు ఎవరూ భయపడవద్దు. పార్టీ లీగల్ సెల్ మీకు అండగా ఉంటుంది. న్యాయం, ధర్మం మన వైపు ఉన్నాయి అని తెలిపారు. చివరగా ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను బయటపెడుతున్న మీడియాకు కృతజ్ఞతలు తెలుపారు. కరీంనగర్‌లో పట్టపగలు జ్యువెలరీ షాపులో దాడి జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్‌కు పరువు, సిగ్గు అనేవి లేవని విమర్శించారు. తమ నేతలపై పోలీసులు ఓవర్ యాక్షన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రైవేటు ఆర్మీలా పని చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ నేతలు, జర్నలిస్టుల ఫోన్లను పోలీసులు హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. తాము ఎవరెవరితో మాట్లాడుతున్నారో తెలుసుకుంటున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా పాలనపై దృష్టి పెట్టాలని కేటీఆర్ కోరారు.

# అటీజం నివారణకు నూతన పరిశోధనలు

## -మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి మెమోరన

## -రిస్ ప్లేస్ ఆటిజం రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తోడుపునూరి, డాక్టర్ కళా రమ్య డైరెక్టర్

మహబూబ్నగర్ ( నేషనలిస్ట్ వాయిస్ ) మే 4

గత నాలుగు నుంచి అయిదు దశబ్దాల కాలం లో ఆందోళనకరంగా పెరుగుతున్న ఆటీజం కేసులు ప్రస్తుతం ఇప్పుడు పుట్టే ప్రతి 50 మంది పిల్లలలో ఒకరు ఆటీజం తో బాధపడుతున్నారు. రానున్న రెండు దశాబ్దాలలో పుట్టే ప్రతి పదిమంది పిల్లల్లో ఒకరికి ఆటీజం వస్తుందని ఒక అంచనా ఉంది దీనిని దృష్టిలో పెట్టుకుని రిస్ ప్లేస్ ఆటిజం రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి పర్యావరణం మరియు గట్ ఆరోగ్యాన్ని సరి చేస్తే ఆటిజన్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చు, అమెరికా ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ సంస్థ (ఇ.పి. ఏ) 2005 లో నిర్వహించిన నవజాత శిశువుపై జరిగిన " బాడీ బడెన్ స్టడీ " నీ మరియు 2025 లో విడుదలైన రెండు దశాబ్దాల పరిశోధనలు " మేక్ అమెరికా హెల్తీ అగైన్ "(మహా) గెజిట్ నివేదికను ప్రాస్తవించారు. ఈ పరిశోధనల ప్రకారం వ్యవసాయంలో వాడే రసాయనాలు పరిశ్రమల నుంచి మంచినీటిలో కలిగే కాలుష్యాలు నాన్ స్టిక్ వంట పాత్రల నుంచి విడుదల అయ్యే పదార్థాలు ఆహార పరిరక్షణ వంటి రసాయనాలు శరీరంలో క్రమంగా చేరి ( బయో అక్యుమిలేషన్ ) గర్భస్థ శిశువుల నాడి వ్యవస్థ అభివృద్ధికి ప్రభావితం చేస్తుందని రిస్ ప్లేస్ ఆటిజం రీసర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి నిర్ధారించారు. ఇలాంటి రసాయనాలు శిశువు గట్ మైక్రో భాయోమ్ అభివృద్ధిని భంగ పరుస్తుంది మరియు మెదడు అభివృద్ధి రోగ నిరోధక వ్యవస్థ నాడి ఆరోగ్యానికి కీలకం పర్యావరణ విషతుల్యత మరియు గట్ ఆరోగ్యం నాడీ అభివృద్ధిని సమస్యలను కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రారంభ దశలోనే రసాయనాల ప్రభావం తగ్గించి మైక్రో బయోమ్ ఆరోగ్యాన్ని మెరుగుపరిస్తే భవిష్యత్ తరానికి ఆటిజం ప్రబల్యాన్ని తగ్గించవచ్చు. ప్రభుత్వ సంస్థలు మరియు నియంత్రణ సంస్థలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే విధానాలపై దృష్టి పెట్టాలి ఆహారం మరియు నీటి భద్రత బలోపేతం చేయాలి. అటిస్టిక్ సమస్యలను ఎదుర్కొంటున్న చిన్నారులలో గట్ బ్రెయిన్ యాక్సిస్ ను పరిరక్షించే ఫికెల్ మైక్రో బయట ట్రాన్స్ ప్లాంటేషన్ (ఎఫ్ టీ ఎం ) తెరపి భారతదేశంలోని మొట్టమొదటిసారిగా చికిత్స అందిస్తున్న ఏకైక సంస్థ రిస్ ప్లేస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్. దేశంలో తొలి స్టూల్ బ్యాంకు ను ఏర్పాటు చేశారు. రిస్ ప్లేస్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్, తొడుపునూరి. మలబద్ధకం ఉబ్బరం ఆహారం జీర్ణం కాని సమస్యలు అనేక అటిస్టిక్ పిల్లలలో కనిపిస్తాయి గట్ లోని



బ్యాక్టీరియా మెదడుకు సాంకేతాలు పంపడం ద్వారా నిద్ర అభ్యాసం ప్రవర్తనకై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు దీనికి పరిష్కారం ఫికల్ మైక్రో బయట ట్రాన్స్నాటేషన్ (ఎఫ్ టీ ఎం ) చికిత్సను అభివృద్ధి చేసింది రీస్ ప్లేస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎఫ్ ఎం టీ,చికిత్స ఆటిజం లక్షణాలలో 30% నుంచి 40% మెరుగుదలలను ఇస్తుందినిర్దిష్ట మెదడు ప్రాంతాలకు సిగ్నలింగ్ అణువును లక్ష్యంగా చేసుకుని అందించడం పరిశోధనలో ఉంది, ఇది 70% నుంచి 80% రికవరీని ఇస్తుందని భావిస్తున్నారు. ఈ పరిశోధన ఇప్పటి నుండి ఒక దశాబ్దం పడుతుంది. అటీజం రీసెర్చ్ లో అటీజం గల చికిత్స,కారణాలు మరియు నివారణ మార్గాలు జనాలకి అందుబాటులో లేవు గర్భధారణకు ముందే ఆటిజాన్ని అరికట్టవచ్చు అనే విషయం మన దేశం మొత్తం మరియు రెండు తెలుగు రాష్ట్రాల ప్రతి గ్రామ గ్రామాలలో విషయం చేరాలన్న ఉద్దేశంతో రిస్ ప్లస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ రాష్ట్ర ప్రభుత్వ మరియు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆటిజం నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి మరియు అవగాహన కల్పించాలనీ రిస్ ప్లేస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ పి.లాలూ ప్రసాద్. మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ మిక్కిలి నేని మను చౌదరి కి మెమోరన ఇవ్వడం జరిగింది.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా నాలుగు క్లస్టర్ లరైతులతో సమావేశము

గండీడ్ ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ ) మే 4

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా నాలుగు క్లస్టర్ ల రైతువేదికలలో రైతులతో సమావేశము ఏర్పటు చేయడము జరిగినది. ఈ సమావేశానికి అతిధులుగా గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్లు, మండలం లీడర్లు, మండల వ్యవసాయ అధికారిణి రాధమ్మ, ఏఈవో సమత మరియు రైతు లా తోఈ కార్యక్రమములో పాల్గోని ఈ సమావేశాన్ని విజయవంతం చేసారు





# అల్లాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ విజయ పోచయ్య

పిట్లం (నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్) మే 4

పిట్లం కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ విజయ పోచయ్య ప్రభుత్వం రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ విజయ పోచయ్య ఉపసర్పంచ్ కులాన్ నాగేందర్ రెడ్డి సొసైటీ సెక్రటరీ హనుమాన్లు సొసైటీ సిబ్బంది రమేష్ సాయిలు వార్డు సభ్యులు గైని రాములు స్వప్న సురేందర్ గంగమని నాగయ్య బాలయ్య గంగారాం జక్కాపురం అంబయ్య రవి విట్టల్ రావు సీనియర్ నాయకులు మల్లేశం మేకల వెంకటేష్ మార్గం రమేష్ మార్గం రాములు మార్గం విట్టల్ మార్గం అంజయ్య రాములు నడిమింటి సాయి నడిమింటి సంతోష్ గంగారాం పలువురు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు




# గ్రామ పంచాయతీ స్థలాల్లో ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకోవాలి

## - స్వాధీనం చేసుకున్న స్థలాలను నిరుపేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలి

## - ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఫిర్యాదు చేసిన సిపిఐ నాయకులు

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 4 (నేషనలిస్ట్ వాయిస్)

పెంటపాడు మండలంలోని పెంటపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం గతంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, అధికారులు తక్షణమే వాటిని స్వాధీనం చేసుకుని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో మండల అభివృద్ధి అధికారి పి.వి.వి.ఎస్ రాంప్రసాద్ కు సిపిఐ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారని తెలిపారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత కారణంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద మరుగుదొడ్లను నిర్మించుకోవటంతో సామూహిక మరుగుదొడ్లు నిరూపయోగంగా మారాయన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది విలువైన ఆయా స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జా కోరల చెరలో నుంచి గ్రామ పంచాయతీ స్థలాలను స్వాధీనపరుచుకుని, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే పార్టీ తరఫున ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వంక అప్పారావు ఏపీ రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# గండీడ్ గడ్డపై బిజెపి విజయోత్సవ సంబరాలు

గండీడ్ ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ ) మే 4

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన చారిత్రాత్మక విజయాలను పురస్కరించుకుని, గండీడ్ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు కె విజయ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన బిజెపి శ్రేణులు "విజయ దుందుభి" మోగించాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. ఈ గెలుపు కేవలం మూడు రాష్ట్రాలదే కాదని, ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంపై ప్రజలకున్న అచంచలమైన నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. "నేడు బెంగాల్, అస్సాం.. రేపు తెలంగాణ" అనే నినాదంతో కార్యకర్తలు ఉత్సాహంగా కదం తొక్కారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో.. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి మల్కయ్య, మండలం ఉపాధ్యక్షులు భద్రేశ్వర్, ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు సంతోష్,కిషన్ మోర్చా మండల అధ్యక్షులు క్రిష్ట రెడ్డి,మాజీ ప్రధాన కార్యదర్శి నరహరి రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జ్ వనపల్లి నవీన్, రాజ వర్ధన్ రెడ్డి ఉప సర్పంచ్,బూత్ అధ్యక్షులు శివ,కృష్ణ,జానంపల్లి వార్డ్ మెంబర్ వంశీ, బిజెపి నాయకులు కేశవ్,నరసింహ,నరసింహ రెడ్డి, మండల స్థాయి వివిధ విభాగాల నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు మరియు మోదీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# దేశం కోసం, ధర్మం కోసం, దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నమ్మకంగా పనిచేసిది భారతీయ జనతా పార్టీ

డా వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబీసీ మోర్చా, తెలంగాణ రాష్ట్రం.

వెస్ట్ బెంగాల్ లో మరో చరిత్ర, ప్రభంజనం.

గండీడ్ ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ ) మే 4




వెస్ట్ బెంగాల్, తమిళ్ నాడులో ప్రజలు అవినీతి, దౌర్జన్యాలకు, కుటుంబ పాలనతో ప్రజలు విసిగి పోయి అక్కడి ప్రభుత్వాలను చిత్తు చిత్తుగా ఓడించారు. ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, స్టాలిన్ కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు, డీ లిమిటేషన్ బిల్లులను వ్యతిరేకించి మన దేశంలోని మహిళలను, సామాన్య ప్రజలను ఏమెల్యే లుగా, ఎంపీలుగా కాకుండా అగౌరవపరచినారు, వారికి మహిళలు, అన్ని వర్గాల ప్రజలు తగిన బుద్ధి చెప్పారు.మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం ఒక్క రోజు సెలవు తీసుకోకుండా అవినీతిలేని స్వచ్ఛమయిన పాలనను అందిస్తూ మన దేశాన్ని ప్రపంచంలోనే విశ్వగురువుగా నిలిపినాడు, ఇదంతా గమనించిన ప్రజలు ఈ రోజు మూడు రాష్ట్రాలు అయిన వెస్ట్ బెంగాల్లో, అస్సాంలో,పాండిచేరిలో అత్యధిక మెజర్టీతో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని గెలిపించడం మహా అద్భుతం. ఈ గెలుపు కోసం అక్కడి రాష్ట్రాలలో నిరంతరం కృషి చేసిన బీజేపీ జాతీయ నాయకులకు, రాష్ట్ర నాయకులకు మరియు కార్యకర్తలకు కృతజ్ఞతలు. మన రాష్ట్రంలోని బీజేపీ నాయకులకు కార్యకర్తలకు మరియు అభిమానులకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు. వచ్చే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో కూడా ఖచ్చితంగా భారతీ జనతా పార్టీ మన రాష్ట్రంలోనీ ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించడం ఖాయం.

# జిల్లా అటవీ అధికారిగా బాధ్యతలు (డి ఎఫ్ ఓ) సి ఎచ్. బాలమణి

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారిగా (డి ఎఫ్ ఓ) శ్రీమతి సి ఎచ్. బాలమణి, ఐ ఎఫ్ ఎస్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా డి ఎఫ్ ఓ మాట్లాడుతూ, అటవీ సంరక్షణ, వృక్షారోపణ కార్యక్రమాలు మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, అటవీ శాఖ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.అలాగే, జిల్లా వ్యాప్తంగా అటవీ సంపదను కాపాడేందుకు మరియు అభివృద్ధి చేసేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




# విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించటం అభినందనీయం

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనిబాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 4 (నేషనలిస్ట్ వాయిస్)

కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని మెరుగైన ఫలితాలు సాధించటం అభినందనీయమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన కోడె వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని, అందుకు నిదర్శనమే విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలని ప్రశంసించారు. విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# అయ్యప్ప గురు స్వామి రవి దాస్ కుటుంబానికి భక్తుల ఆర్థిక సహాయం...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 04 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలం కోసిని గ్రామానికి చెందిన సీనియర్ అయ్యప్ప గురు స్వామి రవి దాస్ ఇటీవల అనారోగ్యం కారణంతో 27 ఏప్రిల్ 2026 రోజున పరమపదించారు వారి కుటుంబానికి అండగా అయ్యప్ప స్వామి భక్తులు తమ వంతు సహాయంగా. విరాళములుగా జమ చేసి 46850/- ల రూపాయలు మరియు 50 కేజీల బియ్యంను వారి కుటుంబానికి అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గురు స్వాములు పోతురాజుల రమేష్, ఎనగంటి బిక్షపతి, పిరిసెంగుల శంకరయ్య, నికూరే నాగేందర్, జయం నాయర్, పత్తిపాక శ్రావణ్ , గుండు సందీప్ గౌడ్, సోనీ కొరియా కోష్, నీలి సతీష్ , వేముల వెంకటేష్, శ్రీరామోజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# 37వ డివిజన్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

-సదుపాయాల కల్పనకు మీ వంతు సహకారం ఎంతో అవసరం
-ఎమ్మెల్యే కూనంనేనికి కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి విజ్ఞప్తి

**భద్రాద్రి కొత్తగూడెం, మే4(నేషనలిస్ట్ వాయిస్):**

కొత్తగూడెం పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 37వ డివిజన్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడంతోపాటు నిధులు కేటాయించాలని పాల్వంచ 37వ డివిజన్ కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి సోమవారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందించి విజ్ఞప్తి చేశారు. 37వ డివిజన్ లో గత 30 సంవత్సరాలనుండి డ్రైనేజీ వ్యవస్థను ఎవరు పట్టించుకోలేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. డివిజన్ లో ఇండ్ల మధ్యలో పెద్ద మురుగు కాలువ ప్రవహిస్తుందని దానిని పునర్ నిర్మాణమునకు కాలువ మరమత్తులకు నిధులు కేటాయించాలన్నారు. డివిజన్ లోని రోడ్లు, డ్రైన్లకు నిధులు కేటాయించాలని సూచించారు. తన డివిజన్ పరిధిలో ఉన్న రామాలయంకు నూతన కమిటీని ఏర్పాటు చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలతో దేవాలయం అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. ఇందుకుగాను తగు చర్యలకు సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సాంబశివరావుకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మల్లెల రవిచంద్ర ఉన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

**దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 4**

దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో నేడు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశం మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389 చెల్లించబడుతుందని తెలిపారు. అలాగే సన్న రకం వరి ధాన్యానికి రూ. 2389తో పాటు అదనంగా రూ. 500 బోనస్ అందజేస్తామని పేర్కొన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణవేణి (కృష్ణ), ఉప సర్పంచ్ సంతోష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి. శేఖర్, బసన్న గౌడ్, వెంకయ్య, ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ రైతులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# చేగుంట సబ్ స్టేషన్ లో విద్యుత్ భద్రత వారోత్సవాలు

చేగుంట మండలం చేగుంట సబ్ స్టేషన్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా విద్యుత్ భద్రత వారోత్సవాలు ఏఈ వెంకటప్ప రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా మా విద్యుత్ సిబ్బందికి సేఫ్టీ కిట్లు పంపిణీ చేయడం జరిగింది . సేఫ్టీ కిట్లు అనగా హెల్మెట్ గ్లౌజులు ఎర్త్ రాడు వంటివి మా సిబ్బందికి ఇవ్వడం జరిగింది. వాటిని ఉపయోగిస్తూ ప్రజలకు మంచి సేవలు అందించాలని సిబ్బందికి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటప్ప రెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ రాములు, లైన్మెన్ కిష్టయ్య విద్యుత్ సిబ్బంది మరియు రైతులు పాల్గొనడం జరిగినది.




# మైక్రో ఫైనాన్స్ బాధితులకు న్యాయం చేయండి

## ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ విజ్ఞప్తి

**భద్రాద్రి కొత్తగూడెం, మే4(నేషనలిస్ట్ వాయిస్):**



మైక్రో ఫైనాన్స్ స్కాంలో హస్తమున్న గాయని మంగ్లీతో సహా దోషులను వెంటనే అరెస్ట్ చేసి ఈ సంచలన స్కామ్ ను సిబిఐకి అప్పగించి నిందితుల ఆస్తులను సీజ్ చేయడంతో పాటు బాధితుల చావులకు ఫుల్ స్టాప్ పెట్టి వారికి సత్వరమే న్యాయం చేయాలని అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులుగిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. చుంచుపల్లి మండలంలో సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ ముసుగులో అనేకమంది గిరిజనుల నుండి భారీగా డబ్బులు దండుకున్నారని మండిపడ్డారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాదాపు 80 శాతం మంది గిరిజన బిడ్డలే డబ్బులు కట్టారని అదే గిరిజన కమ్యూనిటీకి చెందిన గాయని మంగ్లీ ఆమె ముఠా మోసం చేయడం అత్యంత బాధాకరమన్నారు. బాధితుల గోడు కన్నీరు దయనీయ పరిస్థితి చూస్తుంటే హృదయం కన్నీరు మున్నీరుగా కకల వికలమై రోధిస్తున్నదని రోజురోజుకు గాయని మంగ్లీ ఆమె ముఠాపై ఎన్నెన్నో ముఖ్యమైన ఆధారాలు దొరుకుతున్న కూడా అటు రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇటు అన్ని వ్యవస్థలు గాని కళ్ళు లేని కబోదుల చోద్యం చూడడం ప్రభుత్వానికి ఎంతో అప్రతిష్ట అని ఆచార్య డాక్టర్ మద్దెల అభివర్ణించారు.ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత గల వ్యవస్థలన్నీ కళ్ళు తెరిచి దోషులను వెంటనే శిక్షించి బాధితులకు సత్వర న్యాయం జరపకపోతే చరిత్ర హీనులవుతారని ఆచార్య డాక్టర్ మద్దెల హెచ్చరించారు. ఈ అత్యవసర సమావేశంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సినీ నటులు చిత్రపురి వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి తాండూర్ ధనరాజ్, సంఘ గౌరవ అధ్యక్షులు ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, రాష్ట్ర నాయకులు పి.సురేందర్, గుండా రమేష్, డాక్టర్ తమ్మళ్ళ జోసెఫ్, లావుడియా సత్యనారాయణ, అడ్వకేట్ బానోత్ రమేష్, లాల్ సింగ్, బొమ్మెర అశోక్, పృథ్వీరాజ్, మద్దెల ఆదర్శ్, రాజేశ్వరరావు, సుమన్, కేదాసి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జనం మెచ్చిన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బండి నాగేశ్వరరావు

**అడవిదేవులపల్లి మే : 04 (నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )**




అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల కాంగ్రెస్ నాయకుడు బండి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు చేతుల మీదుగా కూరగాయలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజు జరుపుకుంటున్న అటువంటి ప్రియతమ నేత ప్రజా బంధువు మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ప్రజల ఆశీర్వాదాలు,తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని అన్నారు.ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచే నాయకుడు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు.కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, పారిశుధ్య కార్మికులకు కూరగాయలు పంపిణీ చేయడం ద్వారా సామా జిక బాధ్యతను చాటుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బండి నరసింహా రావు, పెద్దింటి రామ్మూర్తి,వార్డ్ నెంబర్ వీరబోయిన వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వీరాంజనేయులు,అన్యబోయిన మల్లికార్జున్, కోరబోయిన రామయ్య, దుండిగళ్ళ నాగరాజు, సాయం సైదయ్య,గంధ శ్రీధర్,పేర్ల రామంజి,గంగుల రామకోటి, పోషమల్ల నరేష్,జానీ పాషా, కొత్ర జయా నందరావు, నరేష్,హనుమంతు,సతీష్, వినయ్,కృష్ణ,నాగి,శివ,మహేష్ బిఎల్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# దేవుడైన 'విధి" కీ తలవంచా ల్సిందే..

**దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే4**

" దేవుడైన"రాముడే విధి కీ తల వంచాల్సి వచ్చింది" విధిరాత మార్చలేము " అనే తత్వాన్ని లవకుశ నాటకం ద్వారా తెలుసుకోవచ్చు అని దోమ మండల సర్పంచుల మాజీ అధ్యక్షులు కె రాజిరెడ్డి తెలిపారు ఆదివారం దోమ గ్రామ పంచాయతీ ఆ వరణలోని చావడి దగ్గర గ్రామ కళాకారులూ ఏర్పాటు చేసుకున్న లవ కుశ నాటక ప్రారంభ కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు తన చెల్లెలుకు జరిగిన అవమానం భరించలేక రావనుడు సీతను అపహారించడం అయోధ్య పురంలో సీతదేవినీ ప్రజలు అవమానంగా చూడడం తో రాముడు రాజుగా దర్మం కోసం తన భార్యను అడవికి పంపడం "లవ కుసులు తండ్రి రామున్నే ప్రశ్నించడం వంటి మహోత్తర గట్టమే ఈ నాటకం అని అన్నదమ్ముల ప్రేమలు త్యాగాలు తల్లి దండ్రుల పట్ల పిల్లల గౌరవం వంటివి ఈ నాటకంలో స్పష్టంగా వినవచ్చు మారుతున్నా సొసైటీ లో కుటుంబ నేపత్యం కలిగిన ఈ అట ద్వారా ప్రజలు ప్రేరణ గా తీసుకోవాలి అని రాజిరెడ్డి సూచించారు, లవ కుశ ఆటలో సీత రాముల లక్ష్మణుడు వారి కుటుంబం అంత ఏకం కావడానికి ఆంజనేయ స్వామి పాత్ర కూడా గొప్పది అని అందుకు ప్రజలు ఆంజనేయ స్వామి వారిని దర్శించుకోవడం మరవ కూడదు అని మాజీ సర్పంచ్ యం రాంచంద్ర రెడ్డి అన్నారు రెండు మాపులు జరిగే ఈ ఆటకు అందరు సహకారం అందించాలని కళాకారులూ నిర్వాహకులు కోరారు.






# బెంగాల్ లో ఎన్ డి ఏ విజయం సాధించడంతో వాజేడు బిజెపి శ్రేణులు సంబరాలు

**వాజేడు (నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్) మే 4**

బెంగాల్ లో విజయం సాధించడంగొప్ప పరిణామం అనేక మంది కార్యకర్తల బలిదానం త్యాగాలు ఫలితం బెంగాల్ విజయం అదే విదంగా అస్సాం లో మూడో సారి తిరిగి బీజేపీ గెలవడం పుదుచ్చేరి లో బీజేపీ నేతృత్వంలో చీణూ గెలవడం మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయాన్ని పురస్కరించుకొని మన వాజేడు మండలం కేంద్రం లో బాణాసంచా కాల్చి మిఠాయి లు పంచి సంబరాలు చేసుకున్నారు
ఈ క్రమంలో మండల అధ్యక్షులు పెద్ది జగపతిబాబు, సీనియరు నాయకులు కందుల రామ్ కిషోర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ సాగి సీతారామరాజు, యలం సుబ్బయ్య, బడే షణ్ముఖారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు





# దళిత సేన ఆధ్వర్యంలో చలివేంద్రం

- ప్రారంభించిన దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 4 (నేషనలిస్ట్ వాయిస్)**

నల్లజర్ల మండలంలోని నల్లజర్లలోని కొయ్యలగూడెం బస్టాప్ వద్ద తూర్పుగోదావరి జిల్లా దళిత సేన అధ్యక్షులు దిరిసిపాం కృష్ణమూర్తి అధ్యక్షతన, దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ సోమవారం ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపకరిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో దళిత సేన ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షులు చీలి మోహనరావు, దేవరపల్లి మండల దళిత సేన ఇంచార్జ్ అరుణ్ కుమార్, పలువురు దళిత సేన నాయకులు పాల్గొన్నారు.

# తూప్రాన్ లో ఘనంగా ప్రారంభమైన రైతు వారోత్సవాలు

## మట్టి పరీక్షలు, ప్రకృతి వ్యవసాయం పై అవగాహన

**తూప్రాన్, మే 4. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారం కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మే 4. నుండి మే 9. వరకు నిర్వహించనున్న రైతు వారోత్సవాల సందర్భంగా ముందురోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు మట్టి నమూనాలు సేకరించే విధానం, వాటి విశ్లేషణ ఆధారంగా పంటలకు తగిన ఎరువుల వినియోగంపై వివరంగా అవగాహన కల్పించారు. మట్టి ఆరోగ్యం మెరుగుపడితేనే దిగుబడులు పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన రైతు సురేందర్ రెడ్డి తన అను భవాలను రైతులతో పంచుకున్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. రైతులకు ప్రత్యక్షంగా మట్టి నమూనాలు ఎలా తీసుకోవాలో డెమో ద్వారా చూపించగా, పంటలలో జనుము, జీలుగ వంటి పంటల సాగు విధానాలు మరియు వాటి లాభాలపై కూడా వివరించారు. అదేవిధంగా నానో యూరియా, నానో డాప్రా వాడకం పై మండల వ్యవసాయ అధికారి గంగమల్లు రైతులకు సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించాలని, ప్రభుత్వం సూచించిన వరి విత్తనాలనే వాడాలని సూచించారు. అధిక యూరియా వినియోగాన్ని తగ్గించాలని, ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ సతీష్, మండల వ్యవసాయ అధికారి గంగమల్లు, ఏఈఓ హరీష్, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ సర్పంచ్‌లు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.






# కాంగ్రెస్ కార్యకర్తల ఆవేదన

## "మా కష్టం ఎవరికోసం?"

**గజ్వేల్, తూప్రాన్, మే, 3.**



ఉమ్మడి తూప్రాన్ మండలంలో రాజాకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలలో అసంతృప్తి రోజురోజుకు పెరుగుతోంది. గజ్వేల్ నియోజకవర్గం ఉమ్మడి తూప్రాన్ మండలంలో ఇందుకు అద్దం పడుతోందనే సంగతి అందరికి తెలిసిందే.. పార్టీ కోసం రాత్రింబవళ్ళు కష్టపడే కార్యకర్తలు తమ పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను సమీకరించడం నుంచి సభలు, సమావేశాలకు జనాలను తరలించడం వరకు అన్ని బాధ్యతలు నిర్వర్తించే కార్యకర్తలు, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడుతున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. "మా చెమట, మా డబ్బు, మా సమయం--- అన్ని పార్టీ కోసం ఖర్చు చేస్తాం. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాకు కనీస గుర్తింపు కూడా ఉండదు" అని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూపాయి రూపాయి కూడబెట్టిన సొమ్మును పార్టీ కోసం వెచ్చిస్తూ, కుటుంబాలను కూడా పక్కన పెట్టి కష్టపడుతున్న కార్యకర్తలకు తగిన ఫలితం దక్కడం లేదని వారు అంటున్నారు. ఇక ముఖ్యంగా పార్టీలోకి కొత్తగా చేరినవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం కార్యకర్తల అసంతృప్తికి ప్రధాన కారణంగా మారింది. "నిన్న వరకూ పార్టీని విమర్శించిన వారు, ఈరోజు కండువా మార్చుకుని వస్తే వారికి పదవులు, అవకాశాలు సులభంగా లభిస్తున్నాయి. కానీ సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడిన మాకు మాత్రం గుర్తింపు లేదు" అని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం జెండా మోసిన భుజాలపై ఇప్పుడు నిరాశ బరువెక్కిందని వారు చెబుతున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే నిజమైన కార్యకర్తలకు విలువ లేకుండా, అవకాశవాదులకు ప్రాధాన్యత పెరుగుతోందని విమర్శిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. "ఈరోజు నాకు జరగలేదు అనుకోవడం పొరపాటు. రేపు ఎవరికైనా ఇదే పరిస్థితి రావచ్చు. కార్యకర్తలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి. పార్టీ కోసం అన్నీ త్యాగం చేయడం కంటే ముందుగా తమ భవిష్యత్తు గురించి ఆలోచించాలి" అని కార్యకర్తలు పరస్పరం చర్చించు కుంటున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న అసంతృప్తి పార్టీ ఉన్నత నాయకత్వానికి ఒక హెచ్చరికగా భావించబడుతోంది. నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయకపోతే, పార్టీకి భవిష్యత్తులో తీవ్రమైన నష్టం వాటిల్లే అవకాశముందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ప్రజావాణిలో వినతులపై తక్షణ చర్యలు

## అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం,మే4(నేషనలిస్ట్ వాయిస్):**



ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తో కలసి ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలు ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత సామూహిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతి వినతిపత్రాన్ని శ్రద్ధగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వెంటనే పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ప్రతి ఫిర్యాదులోని మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ వినతులను పూర్తి వివరాలతో అవసరమైన ఆధార పత్రాలతో సమర్పిస్తే పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రతి ఫిర్యాదుకు సమర్థవంతమైన పరిష్కారం అందేలా అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తులుజూలూరుపాడు మండలం సూరారం గ్రామానికి చెందిన భూలక్ష్మి తన రేకుల ఇల్లు శిధిలావస్థలో ఉందని పలుమార్లు ఇందిరమ్మ గృహం కోసం దరఖాస్తు చేసినప్పటికీ మంజూరు కాలేదని వినతి సమర్పించారు. దీనిపై రెండో విడతలో గృహం మంజూరు అంశాన్ని పరిశీలించాలని గృహ నిర్మాణ శాఖ పీడీకి ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని దుర్గనుబస్తీకి చెందిన నోముల వీరకుమారి తన భర్త గుండెపోటుతో మరణించడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని జీవనోపాధి కల్పించాలని అభ్యర్థించారు. ఆమె వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన భూక్య చంద్రనాయక్ తనకు ఉన్న 18.12 ఎకరాల భూమిలో కొంతభాగాన్ని కుమారులకు బదిలీ చేయడానికి దరఖాస్తు చేసినప్పటికీ కే-ఫామ్ జారీ కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఓఎస్‌డీకి ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం సూదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన వేమూరు వీరస్వామి తన ఇంటిని తన సోదరుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డీపీఓకు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లికి చెందిన గోరియా తన 3 ఎకరాలు 20 కుంటల భూమికి పట్టా కోసం పలుమార్లు దరఖాస్తు చేసినప్పటికీ మంజూరు కాలేదని వినతి సమర్పించారు. ఈ అంశంపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని టేకులపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జోగారావు కాలువ రైతులకు ఎంతో ఉపయోగకరం

## -కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు

### -నవ లిమిటెడ్ సహకారంతో జోగారావు కాలువ ప్రారంభోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం, మే4(నేషనలిస్ట్ వాయిస్):**

జోగారావు కాలువ ఏర్పాటు ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరం ఉంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం భాగంగా నిర్మించిన జోగారావు కాలువను సోమవారం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జోగారావు కాలువ ద్వారా అనేకమంది రైతు కుటుంబాలు అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అలాగే రైతుల యొక్క శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని "జోగారావు కాలువను" నిర్మించి రైతులకు అంకితం చేయడంలో నవలిమిటెడ్ కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ భాగం రామారావు, డిజియం శ్రీకాంత్, సి ఎస్ ఆర్ మేనేజర్ సి హెచ్ శ్రీనివాస్ రావు, కరుణాకర్ సివిల్ ఇంజనీర్, షాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, మున్సిపల్ కమీషనర్ సుజాత, తహసీల్దార్ డి.ప్రసాద్, కార్పొరేటర్లు, రైతులు, సి ఎస్ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.




# విద్య వైద్యానికి "నవ లిమిటెడ్" సహకారం మరువలేనిది

## -కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని

### -నవ లిమిటెడ్ పాల్వంచ సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రిలో నిరీక్షణాలయం ప్రారంభోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం,మే4(నేషనలిస్ట్ వాయిస్):**

విద్య వైద్యానికి "నవ లిమిటెడ్" సహకారం మరువలేనిదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా నిర్మించిన పాల్వంచ ప్రభుత్వ వైద్య కేంద్రం నందు "రోగుల సహాయకుల నిరీక్షణాలయం"ను కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంలో 'నవ లిమిటెడ్' ఎప్పుడు ముందు ఉంటుందని ప్రశంసించారు. భవిష్యత్తులో సామాజిక సేవకు నవ లిమిటెడ్ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోమరాజు దొర మాట్లాడుతూ రోగులు పడుతున్న ఇబ్బందులను నవ లిమిటెడ్ దృష్టికి తీసుకువెళ్ళగా ఆసుపత్రికి రోగుల కొరకు నిరీక్షణాలయంను ఏర్పాటు చేయాల్సిందిగా నవ లిమిటెడ్ వారిని అభ్యర్థించడం జరిగిందని తెలిపారు. అభ్యర్థించిన వెంటనే స్పందించి నిర్మించడంతోపాటు నేడు అప్పగించినందుకు నవ మేనేజ్మెంట్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజియం ఎజి.శంకర్, సివిల్ ఇంజినీర్ శ్రీనివాస్, సి.ఎస్.ఆర్.మేనేజర్ శ్రీనివాస్ రావు, సాబీర్ పాషా,కొత్తగూడెం మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, డి.సి.హెచ్ డాక్టర్ రవి బాబు, డాక్టర్ డి.రాంప్రసాద్, కార్పొరేటర్స్, మున్సిపల్ కమిషనర్ సుజాత, తహశీల్దార్ ప్రసాద్, సి.ఎస్.ఆర్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.





# రూ.15,660 కోట్లకు రాజస్థాన్ రాయల్స్ జట్టు అమ్మకం!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును ఇటీవలే ఆదిత్య బిర్లా గ్రూప్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే కోవలో రాజస్థాన్ రాయల్స్ జట్టు చేరింది. ఈ టీమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, బిలియనీర్ లక్ష్మీ నివాస్ మిట్టల్ ముందుకొచ్చారు. ఈ టీమ్‌లోని 75 శాతం వాటాను మిట్టల్ ఫ్యామిలీ సొంతం చేసుకోవడంతో.. ఆ ఫ్రాంచేజీ మేనేజ్‌మెంట్ మిట్టల్ ఫ్యామిలీ సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ జరుగుతుండగానే ఈ అమ్మకం జరగడం విశేషం. రాజస్థాన్ రాయల్స్ జట్టు ఈ సీజన్‌లో బాగా రాణిస్తుంది. ఈ లీగ్‌లో ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో ఆరు మ్యాచ్‌ల్లో గెలిచిన ఈ జట్టు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కొత్త యజమానిగా భారత సంతతికి చెందిన బిలియనీర్, స్టీల్ కింగ్‌గా పేరుగాంచిన లక్ష్మీ మిట్టల్ కుటుంబం, రాజస్థాన్ రాయల్స్‌ను సొంతం చేసుకుంది. అయితే రాజస్థాన్ రాయల్స్ టీమ్‌లో 75 శాతం వాటాను మిట్టల్ ఫ్యామిలీ రూ.15,660 కోట్లకు కొనుగోలు చేసినట్లు సమాచారం అందుతోంది. బిలియనీర్ లక్ష్మీ మిట్టల్ కుటుంబం, దేశంలో 'వ్యాక్సిన్ కింగ్'గా పేరుగాంచిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ ఆదర్ పూనావాలాతో కలిసి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నివేదికల ప్రకారం.. ఐపీఎల్ జట్టు ఒప్పందం పూర్తయిన తర్వాత, రాజస్థాన్ రాయల్స్‌లో మిట్టల్ కుటుంబం సుమారు 75% మెజారిటీ వాటాను కలిగి ఉంటుంది. అయితే ఆదర్ పూనావాలా సుమారు 18% వాటాను కలిగి ఉంటారు. మిట్టల్-పూనావాలా సంయుక్తంగా ఈ ఒప్పందాన్ని పూర్తి చేశారు. మిగిలిన వాటాను ఇతర పెట్టుబడిదారులు కలిగి ఉంటారు. స్టీల్ కింగ్ బిలియనీర్ లక్ష్మీ మిట్టల్ ఆర్సెలార్ మిట్టల్ వ్యవస్థాపకుడు. ఆదర్ పూనావాలాతో కలిసి మిట్టల్ కుటుంబం, మనోజ్ బాజ్‌పేయ్, అతని గ్రూప్ నుండి రాజస్థాన్ రాయల్స్‌ను స్వాధీనం చేసుకుని, అందులో నియంత్రణ వాటాను పొందేందుకు అంగీకరించింది. ఈ ఒప్పందం విలువ సుమారు వి1.65 బిలియన్లు (సుమారు రూ.15,660 కోట్లు) నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సేల్‌తో రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ బోర్డులో లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్, వనిషా మిట్టల్-భాటియా, అదర్ పూనావాలా, మనోజ్ బాజ్‌పేయ్ చేరనున్నారు. ఆదిత్య మిట్టల్ లక్ష్మీ మిట్టల్ కుమారుడు కాగా, వనిషా మిట్టల్-భాటియా ఆయన కుమార్తె. భారత క్రికెట్ నియంత్రణ మండలి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్, ఇతర నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి, ఈ ఒప్పందం 2026 మూడవ త్రైమాసికంలో అనగా ప్రస్తుత ఐపీఎల్ పూర్తవ్వగానే ఈ డీల్ ఖరారు అవుతుందని భావిస్తున్నారు.




## వన్డే ప్రపంచకప్ టీమ్ నుంచి పంత్ ఔట్!

ఈ ఏడాది ప్రారంభంలో టీమ్ఇండియా చివరిసారిగా న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడింది. ఆ సిరీస్‌లో రిషబ్ పంత్‌ను జట్టులోకి తీసుకున్నారు. కానీ పక్కటెముకల గాయం కారణంగా సిరీస్ ప్రారంభానికి ముందే అతను వైదొలగాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం వన్డే జట్టు నుంచి రిషభ్ పంత్ తన స్థానాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. అతని స్థానంలో సంజూ శాంసన్ లేదా ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్‌గా పరిశీలించే అవకాశం ఉంది. ప్రస్తుతం జరుగుతోన్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో పంత్ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న క్రమంలో సంజూ శాంసన్ బ్యాటర్‌గా వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాడు. ఇదే సీజన్‌లో రెండు సార్లు సెంచరీలు చేసిన శాంసన్.. చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ధోనీ తర్వాత ప్రధాన కీపర్‌గా తన స్థానాన్ని పదిల పరుచుకున్నాడు. భారత్ చివరిసారిగా జనవరిలో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడింది. ఆ సిరీస్‌లో పంత్‌ను జట్టులోకి తీసుకున్నారు, కానీ పక్కటెముకల గాయం కారణంగా సిరీస్ ప్రారంభానికి ముందే అతను వైదొలగాల్సి వచ్చింది, అతని స్థానంలో జురెల్‌ను ఎంపిక చేశారు. పంత్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ పంత్ ఇప్పుడు మరోసారి ఎంట్రీ ఇచ్చింది. అయితే, అతను ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 145.79 స్ట్రైక్ రేట్‌తో కేవలం 189 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇప్పటి వరకు ఒక్క హాఫ్ సెంచరీ కూడా నమోదు కాకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున శాంసన్ ప్రదర్శనలతో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. అతను ఎనిమిది మ్యాచ్‌లలో రెండు సెంచరీలతో సహా 304 పరుగులు చేశాడు. టీ20 ప్రపంచ కప్‌లో భారత్ విజయం సాధించడంతో అతని అద్భుతమైన ఫామ్ కొనసాగింది. ఇటీవలే జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో అతను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా ఎంపికయ్యాడు. మరోవైపు రిషబ్ పంత్ తన చివరి వన్డేను ఆగస్టు 2024లో ఆడాడు. అతను ఈ ఫార్మాట్‌లో 27 ఇన్నింగ్స్‌లలో 33.50 సగటుతో 871 పరుగులు రాబట్టాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. శాంసన్ 16 వన్డేలు ఆడి, ఒక సెంచరీ, ఆరు హాఫ్ సెంచరీలతో సహా 56.66 అద్భుతమైన సగటుతో 510 పరుగులు సాధించాడు. అతను ఆడిన చివరి వన్డే డిసెంబర్ 2023లో దక్షిణాఫ్రికా పర్యటనలో జరిగింది. అక్కడ అతను 78 పరుగుల విజయంతో పాటు 114 బంతుల్లో 108 పరుగులు చేశాడు.

## ఐపీఎల్‌లో 'గర్ల్‌ఫ్రెండ్ కల్చర్'?పై బీసీసీఐ ఆగ్రహం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో కొందరు ఆటగాళ్లు తమ గర్ల్? ఫ్రెండ్స్?తో తిరుగుతూ కనిపిస్తున్న ఫోటోలు, వీడియోలు తీవ్ర దుమారానికి దారితీస్తున్నాయి. ఈ విషయంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్లేయర్స్? అంతా తమ ప్రియురాళ్లతో కలిసి టీమ్ బస్సుల్లో ప్రయాణిస్తూ, హోటళ్లలో బస చేస్తూ తరచుగా కనిపించడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో బీసీసీఐ చర్చలు జరిపి ఓ కీలక నిర్ణయం తీసుకోవాలని ఆలోచిస్తుందని తెలిసింది. హార్దిక్ పాండ్య, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్ వంటి పలువురు ఆటగాళ్లు తమ స్నేహితురాళ్లతో కలిసి ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో తిరుగుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వ్యవహారం బీసీసీఐ దృష్టికి చేరడంతో వెంటనే చర్యలపై చర్చ మొదలైనట్లు తెలుస్తోంది. బీసీసీఐ పాలసీ ప్రకారం ఆటగాళ్లతో కలిసి ప్రయాణించడానికి, హోటళ్లలో బస చేయడానికి కేవలం భార్యలు, కుటుంబ సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే, 'అఫీషియల్ గర్ల్‌ఫ్రెండ్'(అధికారికంగా ప్రకటించిన) అనే పేరుతో కొందరు అనుమతులు పొందుతున్నారన్న వార్తలు బోర్డును ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. అసలు ఇలాంటి నిబంధన ఎక్కడి నుంచి వచ్చిందనే అంశంపై బీసీసీఐలోనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కొంతమంది ఆటగాళ్ల భాగస్వాములు సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్లుగా ఉండటం కూడా వివాదానికి దారితీసింది. వారు గతంలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినట్లు వచ్చిన ఆరోపణలు బీసీసీఐకి మరింత చిక్కులు తెచ్చాయి. ఇది యాంటీ కరప్షన్ యూనిట్‌కు కూడా ఆందోళన కలిగిస్తున్న అంశంగా మారింది. ఇదే సమయంలో కొందరు ఆటగాళ్లు తమ పార్టనర్స్‌తో వ్యక్తిగత విభేదాలకు దిగినట్లు, పోలీస్ ఫిర్యాదుల వరకూ వెళ్లినట్లు సమాచారం. ఈ పరిణామాలు ఐపీఎల్‌తో పాటు బీసీసీఐ ప్రతిష్ఠపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. "ఇప్పుడే ఈ సంస్కృతికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఇది మరింత ప్రమాదకరంగా మారే



అవకాశం ఉంది. జట్టు బస్సుల్లో కూడా ఆటగాళ్లు తమ గర్ల్‌ఫ్రెండ్స్ కోసం వేచి ఉండే ఘటనలు గమనించాం. ఇలాంటి అంశాలపై సమగ్ర విచారణ అవసరం" అని బీసీసీఐకి చెందిన ఒక అధికారి పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై బీసీసీఐ త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టే అవకాశముందని సమాచారం. నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునే దిశగా బోర్డు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో ఆటగాళ్ల ప్రవర్తన మరోసారి చర్చనీయాంశంగా మారగా, బీసీసీఐ తీసుకునే నిర్ణయాలు ఇప్పుడు కీలకంగా మారాయి.ఇదిలా ఉండగా ఐపీఎల్ సీజన్? ప్రారంభమవగానే వాటితో పాటు వివిధ రకాల స్కామ్?లు కూడా మొదలవుతాయి. అందులో భాగంగా కొత్తగా ఐపీఎల్ టికెట్ల పేరుతో ఓ మోసం బయటపడింది. కొందరు మోసగాళ్లు ప్రముఖుల పేర్లతో ఫోన్ కాల్స్, నకిలీ అధికారిక లేఖలను ఉపయోగించి ఐపీఎల్ టికెట్లను సంపాదిస్తున్నారు.



## స్వదేశం వెళ్లిపోయిన ఫిల్ సాల్ట్

ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస విజయాలతో జోరుమీదున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి బిగ్ షాక్ తగిలింది. వేలి గాయంతో బాధపడుతున్న ఆ జట్టు విధ్వంసకర ఓపెనర్ ఫిల్ సాల్ట్ స్వదేశం వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గత ఏప్రిల్ 18న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫిల్ సాల్ట్ చేతి వేలికి గాయమైంది.డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ బౌండరీ వద్ద బంతిని ఆపేందుకు డైవ్ చేసినప్పుడు ఫిల్ సాల్ట్ ఎడమచేతి వేలికి తీవ్ర గాయమైంది. ఈ గాయంతో అతను ఇప్పటికే మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. ఫిల్ సాల్ట్ గాయం తీవ్రతపై ఆర్‌సీబీ ఇప్పటి వరకు అధికారిక ప్రకటన చేయలేదు. అయితే మెరుగైన వైద్యం కోసం అతను యూకే వెళ్లినట్లు తెలుస్తోంది.అతను తిరిగి వచ్చే విషయంపై ఎలాంటి క్లారిటీ లేదు. ఈ సీజన్ ఆరంభంలో పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన ఫిల్ సాల్ట్ ఆ తర్వాత టచ్‌లోకి వచ్చి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 6 ఇన్నింగ్స్‌ల్లో 168.33 స్ట్రైక్‌రేట్‌తో 202 పరుగులు చేశాడు. ముఖ్యంగా విరాట్ కోహ్లీతో కలిసి పవర్ ప్లేలో మెరుపు ఆరంభాన్ని అందిస్తున్నాడు. సాల్ట్ గైర్హాజరీలో జాకోబ్ బెతెల్ బరిలోకి దిగుతున్నా.. అతను ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. దాంతో కోహ్లీపై అదనపు ఒత్తిడి పడి ఆర్‌సీబీ బ్యాటింగ్ ఆర్డర్‌పై ప్రభావం చూపుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఆర్‌సీబీకి ఫిల్ సాల్ట్ గైర్హాజరీ పెద్ద ఎదురుదెబ్బగా మారింది. జాకోబ్ బెతెల్ రూపంలో మంచి ప్రత్యామ్నాయం ఉన్నా.. అతను ఇంకా తన సత్తా చూపించలేదు.గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఆర్‌సీబీ పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ అనంతరం ఆర్‌సీబీకి 6 రోజుల విశ్రాంత లభించగా.. ఆర్‌సీబీ ఆటగాళ్లు సేద తీరుతున్నారు. కొందరు తమ స్వస్థలాలకు వెళ్లగా.. మరికొందరు మాల్దీవ్స్‌కు వెళ్లారు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మే7న జరిగే తమ తదుపరి మ్యాచ్‌లోపు తిరిగి జట్టులో చేరనున్నారు.

## మూడు ఫార్మాట్లు ఆడుతాను పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్



పాకిస్థాన్ తరఫున మూడు ఫార్మాట్లు ఆడుతానని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. ఈ విషయంలో సందేహం అక్కర్లేదన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) 2026 సీజన్‌లో తాను సారథ్యం వహించిన పెషావర్ జల్మీ టీమ్‌ను బాబర్ ఆజామ్ విజేతగా నిలబెట్టాడు. ఈ టోర్నీలో బాబర్ ఆజామ్ 588 పరుగులతో సత్తా చాటాడు.గత కొద్ది రోజులుగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌తో టచ్‌లోకి వచ్చాడు. ఒకప్పుడు కోహ్లీతో పోటిపడిన బాబర్ ఆజామ్.. ఫామ్ కోల్పోయి పాకిస్థాన్ జట్టులో చోటు కూడా కోల్పోయాడు. అయినా పట్టువదలని బాబర్ ఆజామ్.. పీఎస్ఎల్‌లో సత్తా చాటి పాకిస్థాన్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు.పీఎస్ఎల్ 2026 సీజన్ విజయానంతరం మీడియాతో మాట్లాడిన బాబర్ ఆజామ్.. ఏ ఫార్మాట్‌లకు ప్రాధాన్యత ఇస్తారని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. 'టెన్షన్ వద్దు. మూడు ఫార్మాట్లు ఆడుతాను.'అని బాబర్ ఆజామ్ స్పష్టం చేశాడు. క్రికెటర్లు ఫార్మాట్‌లను ఎంచుకోవద్దని అభిప్రాయపడ్డాడు. ప్రతీ ప్లేయర్ మూడు ఫార్మాట్లు ఆడాలని, అలా చేయడం వల్ల వారి సామర్థ్యాలు మెరుగుపడుతాయని తెలిపాడు. 'ఆటగాడు కేవలం ఆడటానికే. ప్రతి ఒక్కరూ అన్ని ఫార్మాట్‌లు ఆడాలి, టీ20లు, వైట్ బాల్‌కే పరిమితం కాకూడదు. రెడ్ బాల్ క్రికెట్ అపారమైన అనుభవాన్ని, ఇన్నింగ్స్ నిర్మాణం, సహనాన్ని అందిస్తుంది. దేశవాళీ నాలుగు రోజుల క్రికెట్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడే అనుభవం ఇస్తుంది. ఒక ఫార్మాట్ ఆడటం వల్ల మరొక ఫార్మాట్‌కు సహాయపడుతుంది .రెడ్ బాల్ గేమ్ టీ20లు, వన్డేల్లో మేలు చేస్తుంది. టెస్ట్ మ్యాచ్‌ల్లో పెంపొందించుకునే సహనం, మానసిక స్థితి వైట్-బాల్ క్రికెట్‌లో ఉపయోగపడుతుంది. గత కొద్ది రోజులుగా బ్యాటింగ్‌లోనాపై పెట్టుకున్న అంచనాలను అందుకోలేకపోయాను. ఇలా జరగడం మామూలే. కొన్నిసార్లు ప్రణాళికలు సరిగ్గా అమలు కావు. మీరు ఎంత ప్రయత్నించినా.. కొన్ని విషయాలు మీకు అనుకూలంగా ఉండవు.ఇలాంటి పరిస్థితుల్లో రెండు అడుగులు వెనక్కి వేసి, స్వీయ విశ్లేషణ చేసుకోవాలన్నాడు. తప్పులను విశ్లేషించి వాటిని సరిదిద్దుకోవాలి. నేను అదే చేశాను. నా సన్నిహితులు అపారమైన మద్దతు ఇచ్చారు. నా కుటుంబం, స్నేహితులు నన్ను ప్రోత్సహించారు. కోచ్‌లతో మాట్లాడి, నా ఆటను మెరుగుపర్చుకున్నాను.

# కల్కి-2 షూటింగ్‌లో ప్రభాస్ చేరిక ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న

ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 -2' ప్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్-నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిన్ని ÷నైల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ వీఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.








# విశ్వంభరలో త్రిష లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది.ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్టాం÷-రగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవి-త్రిష కాంబినేషన్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన హైలైట్. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో వారి పాత్రలు ఎలా మలచబడ్డాయో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రానికి దర్శకుడు వశిష్ట విజువల్ ట్రీట్ ఇవ్వడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి వీఎఫ్ఎక్స్ స్టూడియోలు ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాయని సమాచారం. దీంతో 'విశ్వంభర' విజువల్‌గా కూడా అద్భుతంగా ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా కొనసాగుతోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం టాలీవుడ్‌లో నెవర్ బిఫోర్ అనిపించే స్థాయిలో ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో రూపొందుతోంది. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశముంది.

# సొంత కథతో సిద్ధం అవుతున్న రామ్



దేవదాసుతో వెండితెరకు పరిచయమైన రామ్ తన ఎనర్జీతో, డ్యాన్స్‌తో, యాక్టింగ్‌తో టాలీవుడ్‌ను ఊపేశాడు. లవర్ బాయ్‌గా అమ్మాయిల మనసు గెలిచిన రామ్, ఇస్మార్ట్ శంకర్ తో మాస్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. కానీ, గడిచిన కొంతకాలంగా రామ్ కెరీర్ ఒక విచిత్రమైన సందిగ్ధంలో పడింది. వరుస ప్లాపులు.. అంచనాలు తప్పిన లెక్కలు. ఇప్పుడు వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు రామ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. రామ్ కెరీర్‌ను ఒకసారి గమనిస్తే.. అటు క్లాస్ సినిమాలతో పాటు, మాస్ సినిమాలతోనూ సత్తా చాటుకున్నారు. ఇక కరోనా కు ముందు వచ్చిన ఇస్మార్ట్ శంకర్ రామ్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ మైల్‌స్టోన్‌గా నిలిచింది. పూరీ జగన్నాథ్ మార్క్ మేనరిజమ్స్‌తో రామ్ ఊరమాస్ అవతారంలో అదరగొట్టాడు. కానీ ఆ తర్వాత వచ్చిన రెడ్, ది వారియర్, స్కంద, చివరకు డబుల్ ఇస్మార్ట్ కూడా ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయాయి. రీసెంట్ మూవీ ఆంధ్రా కింగ్ కథ పరంగా బాగుందని ప్రశంసలు దక్కించుకున్నా, కమర్షియల్‌గా రామ్‌కు కావాల్సిన పెద్ద బ్రేక్ ఇవ్వలేకపోయింది. దీంతో రామ్ తన కెరీర్ పట్ల పూర్తిస్థాయి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒక హీరో వరుస ప్లాపుల్లో ఉంటే కొత్త దర్శకుల కోసం వెతుకుతారు. కానీ రామ్ ఆలోచన డిఫరెంట్‌గా ఉంది. తన బలాలు ఏంటి? బలహీనతలు ఏంటి? అనేది ఒక నటుడిగా తనకన్నా బాగా ఇంకెవరికి తెలుస్తుంది అనుకున్నాడట. అందుకే తన తదుపరి సినిమాకు తానే కథను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. మొదట కథ ఇచ్చి వేరే దర్శకుడితో చేయిద్దాం అనుకున్నా, చివరి నిమిషంలో మనసు మార్చుకుని మెగాఫోన్ పట్టాలని డిసైడ్ అయ్యాడట. సినిమాల ఎంపికలోనూ, మేకింగ్ ప్రాసెస్‌లోనూ రామ్ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. ఇప్పుడు అదే అనుభవంతో తన సొంత బ్యానర్ స్రవంతి మూవీస్ లో ఈ భారీ ప్రాజెక్టును తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో అడవి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోస్ తమ సొంత కథలతో సక్సెస్ అవుతున్నారు. ఇప్పుడు రామ్ కూడా అదే బాటలో ప్రయాణించి తన ఫేట్‌ను మార్చుకోవాలని చూస్తున్నారు.

# జైహనుమాన్‌లో అక్షయ్ ఖన్నా ?

టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను హాలీవుడ్ రేంజ్‌లో విస్తరిస్తున్నారు. ప్రస్తుతం అందరి కళ్లు ఆయన ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న 'జై హనుమాన్'పైనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన కాస్టింగ్ అప్‌డేట్‌కు సంబంధించి ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా నటనకు ఫిదా అయిన ప్రశాంత్ వర్మ, ఆయనను 'జై హనుమాన్' ప్రాజెక్టులోకి కూడా ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లోని 'మహాకాళి' చిత్రంలో అక్షయ్ ఖన్నా 'శుక్రాచార్యుడి' గా కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అక్షయ్ ఖన్నా పోషించబోయే పాత్రపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 'మహాకాళి'లో ఆయన చేస్తున్న శుక్రాచార్యుడి పాత్రకు, 'జై హనుమాన్'లోని పాత్రకు ఏమైనా లింక్ ఉంటుందా? లేక ఇది సరికొత్త పాత్రనా? అన్నది మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రశాంత్ వర్మ తన యూనివర్స్‌లోని పాత్రలను ఒకదానితో ఒకటి అనుసంధానించడంలో దిట్ట కాబట్టి, అక్షయ్ ఖన్నా ఎంట్రీ ఈ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తోంది. కేవలం బాలీవుడ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొనే కాకుండా, పాత్రకు ఉన్న వెయిటేజ్ కారణంగానే ఆయనను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. క 'జై హనుమాన్'లో కన్నడ స్టార్, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ హనుమంతుడుగా చేస్తున్న విషయం తెలిసిందే. రిషబ్ శెట్టి లాంటి పవర్‌ఫుల్ పర్ఫార్మర్‌కు తోడు అక్షయ్ ఖన్నా వంటి వెర్సటైల్ యాక్టర్ తోడవ్వడం సినిమాకు పెద్ద అసెట్ కానుంది. ప్రశాంత్ వర్మ విజన్ ప్రకారం, ఈ యూనివర్స్‌లో ప్రతి పాత్రకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది, కాబట్టి అక్షయ్ ఖన్నా రోల్ కూడా కథను మలుపు తిప్పేలా ఉంటుందని టాక్. మొత్తానికి ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను పాన్-ఇండియా లెవల్‌లో స్టాం÷-రగ్‌గా బిల్డ్ చేస్తున్న తీరు చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమనిపిస్తోంది. 'జై హనుమాన్'లో అక్షయ్ ఖన్నా రోల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




# ఆదిత్యరాయ్‌తో డేటింగ్‌లో సుతారియా





బాలీవుడ్ లో ఇప్పుడు సినిమాల కంటే స్టార్ల వ్యక్తిగత జీవితాల చుట్టూనే ఎక్కువగా వార్తలు నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా హీరోహీరోయిన్ల డేటింగ్‌కు సంబంధించి, ఏ చిన్న టాపిక్ వచ్చినా.. అది సెన్సేషన్‌గా మారుతోంది. గతంలో ఇలాంటి డేటింగ్ వ్యవహారాల అనంతరం సెలబ్రిటీలు కొందరు మ్యారేజ్ చేసుకున్న వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఇలాంటి విషయాలు కామన్‌గా మారిపోరాయి. ఇప్పుడీ కామన్ పాయింట్‌లోకి మరో కొత్త జంట వచ్చి చేరారు. 'ఆషికీ2', 'ఓకే జాను' చిత్రాల ఫేమ్ ఆదిత్య రాయ్ కపూర్.. 'తడప్', 'హీరోపంతి 2' ఫేమ్ తారా సుతారియా డేటింగ్‌లో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియా సర్కిల్స్‌లో వార్తలు సెన్సేషన్‌గా మారాయి. బాలీవుడ్‌లోని ప్రధాన మీడియా సంస్థలు వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని అధికారికంగా ధృవీకరించడంతో.. సోషల్ మీడియాలో వారిద్దరి గురించే డిస్కషన్ నడుస్తోంది. ఇటీవల జరిగిన పలు సినీ వేడుకలు, ప్రైవేట్ పార్టీల్లో వీరిద్దరూ జంటగా కనిపించడంతో అభిమానులకు ముందే అనుమానం వచ్చింది. కొన్నిరోజులుగా వీరి రిలేషన్‌పై వార్తలైతే వినిపిస్తున్నాయి కానీ, అధికారికంగా ఎక్కడా రివీల్ కాలేదు. ఇప్పుడు ప్రధాన మీడియా సంస్థలే కన్ఫర్మ్ చేయడంతో.. ఇద్దరి మధ్య రిలేషన్ నిజమే అనేలా ఫ్యాన్స్ కూడా ఫిక్స్ అవుతున్నారు. ఇద్దరు నటులు తమ వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచినప్పటికీ, వరుసగా జంటగా కనిపిస్తుండటం మాత్రం వారి మధ్య ఏదో ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. 2026 ప్రారంభంలో ముంబైలో తారా సుతారియా తన కొత్త ఇంటికి మారిన సమయంలోనూ ఈ జోడీ సందడి చేయడం విశేషం. సోషల్ మీడియాలో నెటిజన్లు వీరిని 'పవర్ కపుల్' అంటుంటే.. వీరి క్లాసిక్, సైలెంట్ పర్సనాలిటీలు ఒకరికొకరు పర్ఫెక్ట్‌గా సెట్ అవుతాయని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ చేతినిండా అవకాశాలతో బిజీ బిజీగా ఉన్నారు. యష్ 'టాక్సిక్'లో తారా సుతారియా ఓ కీలక పాత్రను పోషిస్తోన్న విషయం తెలిసిందే. ఆదిత్య రాయ్ కపూర్ విషయానికి వస్తే.. ఇంతకు ముందు అనన్యా పాండేతో పాటు పలువురితో ప్రేమాయణం నడపగా, తారా సుతారియా కూడా వీర్‌తో కొన్నాళ్లపాటు డేటింగ్‌లో ఉన్నట్లుగా టాక్ నడిచిన విషయం తెలిసిందే.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656